


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

24.08.2026

సోమవారం| రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 55

పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## మాజీ మంత్రి కారుమూరి అరెస్ట్

- ఏపీ లిక్కర్ రవాణా స్కామ్ కేసులో..
- హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ
- పీఎంఎల్ఏ కింద మనీలాండరింగ్ కోణంలో విచారణ


2లో..



హైదరాబాద్, ఆగస్ట్ 23, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మద్యం రవాణా కుంభకోణం కేసు తీవ్ర ఉత్కంఠకు దారి తీసింది. ఈ కేసులో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న అధికారులు, ఆపై విచారణ నిమిత్తం బషీర్‌బాగ్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. ఈ అరెస్ట్‌తో రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రకంపనలు రేగుతున్నాయి.

## యువతలో నైపుణ్య లోటు



న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్

దేశంలో యువతకు సంబంధించి ఆందోళన కలిగించే విషయాలను నీతి ఆయోగ్ తాజా నివేదిక వెల్లడించింది. 15 ఏళ్ల దగ్గరి నుంచి 29 ఏళ్ల మధ్య వయసు ఉన్న 8.7 కోట్ల మందికి పైగా యువత చదువుకోవడం.. ఉద్యోగం చేయడం లేదా నైపుణ్య శిక్షణ పొందడం లేదు. వీరిని 'నీట్ యూత్'గా నీతి ఆయోగ్ నిర్వచించింది. 'రిమైనింగ్ స్కిల్లింగ్ ఫర్ వికసిత్ భారత్@2047' పేరుతో విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలను నీతి అయోగ్ ప్రస్తావించింది.

- చదువు, ఉద్యోగానికి దూరంగా 8.7 కోట్లు
- గ్రాడ్యుయేట్లలో 8.25 శాతానికే తగిన ఉద్యోగాలు
- స్కిల్లింగ్‌కు అడ్డంకులు
- ప్రాక్టికల్ లెర్నింగ్‌పై దృష్టి అవసరం
- మహిళలకు సబ్సిడీతో నైపుణ్య శిక్షణ
- విద్యతో పాటు సంపాదనకు అవకాశాలు

2లో..

## అంతరిక్ష రంగంలో భారత్ దూసుకుపోతున్నది

- స్పేస్ స్టార్టప్‌ల సీఈవోలతో ప్రధాని మోదీ
- పెట్టుబడిదారులకు ఒక 'ఆయస్కాంతం' లా
- జెన్-జీ యువత సరికొత్త టెక్నాలజీని నిర్మిస్తోంది





న్యూఢిల్లీ, ఆగస్ట్ 23, అనంతజనశక్తి న్యూస్

జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు, శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష రంగం లో భారత్ ప్రపంచవ్యాప్తంగా దూసుకుపోతోందని, పెట్టుబడిదారులకు ఒక 'ఆయస్కాంతం' లా మారిందని ఆయన అభివర్ణించారు. స్పేస్ సెక్టార్‌లోని స్టార్టప్‌ల సీఈవోల తో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జెన్-జీ యువత సరికొత్త టెక్నాలజీని నిర్మిస్తోందని ప్రశంసించారు. అదేవిధంగా తన ప్రసంగాలతో కూడిన ఒక వీడియోను ఆయన పంచుకున్నారు.

2లో..

## రాజకీయ కారణాలతోనే అనుమతి ఇవ్వలేదు!

- లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు
- ఖర్గేకు రేవంత్ కృతజ్ఞతలు
- మద్దతిచ్చిన వారందరికీ ధన్యవాదాలు
- లండన్ పర్యటన పూర్తి
- హైదరాబాద్‌లో పూర్తి వివరాలు
- సీఎం వ్యాఖ్యలపై ఆసక్తి

2లో..




హైదరాబాద్, ఆగస్ట్ 23, అనంతజనశక్తి న్యూస్


తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తన అమెరికా పర్యటన రద్దు వ్యవహారంపై ఎక్స్ వేదికగాస్పందించారు. కేంద్ర విదేశాంగ శాఖ.. తన అమెరికా పర్యటనకు రాజకీయ కారణాలతోనే అనుమతి నిరాకరించిందని సంచలన ఆరోపణలు గుప్పించారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లకుండా లండన్ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత తన పర్యటన రద్దుకు సంబంధించిన అన్ని విషయాలపై మాట్లాడతానని తేల్చి చెప్పారు.

సోషల్ మీడియా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి తన తాజా వ్యాఖ్యలను వెల్లడించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ.. అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడంతో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్‌ప్రకారం లండన్ నుంచి బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం రాజకీయ కారణాలతోనే జరిగిందని ఆయన పేర్కొన్నారు. అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించిన అంశంలో తనకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా తనకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, దేశవ్యాప్తంగా తనకు మద్దతు తెలిపిన ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. లండన్‌లో తన సమావేశాలు, ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలను పూర్తి చేసినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. గత 3 రోజులుగా తనకు లభించిన మద్దతు పట్ల ఆయన కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

## వర్షాల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోండి
- హోంమంత్రి అనిత కామెంట్
- 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు

2లో..



## ఒడిశా తీరానికి సమీపంలో కార్గో నౌక మునక

- 22 మంది గల్లంతు.. పనామా జెండాతో ప్రయాణిస్తున్న నౌక

న్యూఢిల్లీ, ఆగస్ట్ 23, అనంతజనశక్తి న్యూస్

పనామా జెండాతో ప్రయాణిస్తున్న కార్గో నౌక బంగాళాఖాతంలో మునిగిపోయింది. ఒడిశాలోని పారాదీప్ తీరానికి సుమారు 240 నాటికల్ మైళ్ల దూరంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉన్నారు. ప్రమాదం సమాచారం అందిన వెంటనే భారత కోస్ట్ గార్డ్, నేవీ సంయుక్తంగా గాలింపు, సహాయక చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు ఇద్దరిని సముద్రంలో నుంచి రక్షించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది.

2లో..

## తెలంగాణలో 'ఛత్రోంకీ గూంజ్' పెట్టాలి

- రాహుల్‌కు అంత దమ్ము ఉందా?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- రాహుల్ గాంధీ తెలంగాణకు రావాలి
- ఏ ఒక్క స్టూడెంట్ రాహుల్‌ను రానివ్వడు



5లో..

హైదరాబాద్, ఆగస్ట్ 23, అనంతజనశక్తి న్యూస్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తెలంగాణలో ఛత్రోంకీ గూంజ్ పెట్టాలని ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రామచందర్ రావు సవాల్ విసిరారు. తెలంగాణకు రావాలని రాహుల్ గాంధీని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణకు రాహుల్ గాంధీని ఒక్క విద్యార్థి కూడా రానివ్వడని అన్నారు. తెలంగాణలో అడుగుపెడితే రాహుల్ గాంధీని విద్యార్థులే అడ్డుకుంటారని తెలిపారు. గతంలో హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్ గాంధీ.. విద్యార్థులకు ఇచ్చిన హామీలు మరిచిపోయారని ఆయన పేర్కొన్నారు. ఆదివారం న్యూఢిల్లీలో ఎన్ రాంచందర్ రావు మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యార్థుల సమస్యలపై బీజేపీ కార్యాలయం ముందు రెండు రోజులు నిరాహార దీక్ష చేస్తామని స్పష్టం చేశారు.

## పోలీస్ వాహనానికి బ్రేకులు ఫెయిల్.!

- కానిస్టేబుల్ దుర్మరణం
- విజయనగరం జిల్లాలో ఘటన

5లో..



## నిజామాబాద్‌ను అన్ని రంగాల్లో డెవలప్ చేస్తాం

- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



2లో..

## కుట్ర చేయాల్సిన అవసరం లేదు



2లో..

- మంత్రి కొండా సురేఖ వ్యవహారం
- మంత్రి వాకిటి శ్రీహరి కామెంట్
- ఎవరు తప్పు చేసినా చర్యలు తీసుకోవాల్సిందే
- నేను ఇబ్బంది కలిగించినా చర్యలు తీసుకోవాల్సిందే



## కూటమి పాలనలో పాఠశాల విద్యా రంగం నిర్వీర్యం

- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థులు
- ప్రైవేట్ బడుల వైపు పెరిగిన చేరికలు
- కూటమి సర్కార్‌పై జగన్ తీవ్ర విమర్శలు
- నాడు-నేడు ప్రస్తావిస్తూ జగన్ కీలక వ్యాఖ్యలు

2లో..

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# దౌత్యనీతి అంటే టీ20లే కాదు.. టెస్టులూ ఉంటాయి: జైశంకర్



దౌత్యం, భౌగోళిక రాజకీయాలను ఎల్లప్పుడూ త్వరిత ఫలితాల దృష్టితో అంచనా వేయలేమని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. కొన్ని అంతర్జాతీయ సవాళ్లకు సహనం, దీర్ఘకాలిక నిబద్ధత అవసరమని చెప్పారు. 'ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్'ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రస్తుత దౌత్యనీతి 'టీ20 క్రికెట్'ను పోలి ఉందా? అనే ప్రశ్నకు ఆయన ఈమేరకు స్పందించారు.

''అంతర్జాతీయ సంబంధాలు సుదీర్ఘమైన, అనిశ్చిత ప్రక్రియలతో కూడుకున్నవి. భౌగోళిక రాజకీయ సమస్యలకు ప్రభుత్వాలు, మీడియా త్వరితగతిన పరిష్కారాలు కోరుకుంటాయి. కానీ వీటి పరిష్కారం సుదీర్ఘ కాలంలో రూపుదిద్దుకుంటుంది. అదే సమయంలో టీ20 మాదిరి.. మీడియాకు స్వల్పకాలిక పరిణామాలను అందించాల్సిన అవసరం ఉంది. అయితే, వాస్తవ ప్రపంచంలో టెస్ట్ మ్యాచ్‌లూ ఉంటాయి. వాటి ఫలితాలు తక్కువ సమయంలో తేలిపోయేవి కావు. పశ్చిమాసియా యుద్ధం ఒక టీ20 మ్యాచ్‌లా ఉంటుందని అంతా భావించారు. కానీ అది ఏకంగా టెస్ట్ సిరీస్, అంతకంటే ఎక్కువ కాలం సాగే ప్రక్రియగా మారింది'' అని పేర్కొన్నారు.

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా గొలుసు సమస్యలు, మార్కెట్ అంతరాయాలతో కూడిన నేటి అనిశ్చిత ప్రపంచంలో వ్యాపార సంస్థలు, ప్రభుత్వాల కోసం జైశంకర్ నాలుగు సూత్రాలను సూచించారు.

అంతరాయాల నుంచి తమను తాము కాపాడుకోవడం వ్యాపార సంస్థలు, ప్రభుత్వాల ప్రాధాన్య అంశంగా ఉండాలని చెప్పారు. 'డిరిస్కింగ్' తన అతి పెద్ద మంత్రమని పేర్కొన్నారు.

ఎక్కువ మంది భాగస్వాములు, అధిక సంఖ్యలో సరఫరా వనరులపై ఆధారపడాలని సూచించారు. ఎన్ని ఎక్కువ ఆప్షన్లు ఉంటే అంత సురక్షితంగా ఉంటారని తెలిపారు.

ప్రపంచ మార్కెట్లు తరచూ భౌగోళిక రాజకీయాల వల్ల ప్రభావితమవుతాయనే విషయాన్ని అంగీకరించాలన్నారు. ఇంధనం, ఎరువులు, రవాణా వంటివి దీనికి ఉదాహరణలని తెలిపారు. అంతరాయాలు ఎప్పుడైనా కలగవచ్చని అంచనా వేసి.. ముందుగానే ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. వైవిధ్యం పాటించి, పెట్టుబడులకు భద్రత కల్పించుకోవాలని చెప్పారు.


# ఆరోగ్యం బాలేకపోతే.. చాట్‌జీపీటీలో వెతికేస్తున్నారు..! – రాజ్‌నాథ్‌సింగ్



అనారోగ్యానికి గురైతే వైద్యుడి వద్దకు వెళ్లకుండా ఇంటర్నెట్, చాట్‌జీపీటీ(లో లక్షణాలను వెతికి.. తమకు ఫలానా వ్యాధి ఉందని ఊహించుకోవద్దని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. అలా చూసుకునేవారి సంఖ్య దేశంలో రోజురోజుకీ పెరుగుతోందని తెలిపారు. శనివారం నోయిడాలో ఆయన మాట్లాడుతూ.. ''ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం మంచి పరిణామమే. కానీ ఇంటర్నెట్‌లో కనిపించిన సమాచారంతో ఒక నిర్ణయానికి రావడం సరైంది కాదు. స్వల్పంగా ఛాతినొప్పి వచ్చినా.. ఆన్‌లైన్‌లో వెతికి తీవ్రమైన గుండె జబ్బు ఉందని కొందరు భయపడుతున్నారు. అదే నొప్పి.. ఆందోళన, కండరాల సమస్యల వల్ల కూడా రావచ్చు. కొందరు రోగులు వారికి ఉన్న లక్షణాలు చెప్పకుండా.. ఇంటర్నెట్‌లో చదివిన వ్యాధి పేరును వైద్యుడికి చెబుతున్నారు'' అని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు.. స్థానిక భాషలోని పదాలతో లక్షణాలను చెప్పడం కూడా వైద్యులకు సవాలేనని రాజ్‌నాథ్ అన్నారు. ఛాతీలో 'దుక్ దుక్' గా ఉందని ఓ గ్రామీణుడు వైద్యుడికి చెప్పిన ఉదాహరణను ఆయన వివరించారు. వైద్య విద్యలో 'దుక్ దుక్' అనే లక్షణం గురించి ఎక్కడా ఉండదని చమత్కరించారు. యంత్రాలు శరీరంలో ఏం జరుగుతుందో గుర్తించగలవు.. కానీ రోగి మనసులోని భయం, ఆందోళనను అర్థం చేసుకోవడం వైద్యులకే సాధ్యమని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు.

# ఎండోస్కోపిక్ కెమెరాతో ఫొటోలు తీసి.. ప్రశ్నపత్రం లీక్ చేసి!

**ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల వ్యవసాయ విశ్వవిద్యాలయం పేపర్ లీక్ ఘటన కలకలం రేపింది. ఈ వ్యవహారంలో ప్రైవేటు కళాశాలకు చెందిన ఓ ప్రొఫెసర్‌తోపాటు ఐదుగురు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు విద్యార్థులు పరారీలో ఉన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్.. ప్రశ్నపత్రం ఉన్న సీల్డ్ కవర్‌లోకి ఎండోస్కోపిక్ కెమెరాను పంపించి ఫొటోలు, వీడియోలు తీసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. రాయ్‌పుర్‌లోని ఇందిరాగాంధీ కృషి విశ్వవిద్యాలయ (ఐజీకేవీ) ఆధ్వర్యంలో ఈ నెల 20న బీఎస్సీ అగ్రికల్చర్ రెండో ఏడాది ఎంటమాలజీ పరీక్ష నిర్వహించారు. అయితే, పేపర్ లీక్ అయినట్లు అదే రోజు ఐజీకేవీ అధికారులకు మెయిళ్లు వచ్చాయి. కొన్ని ప్రశ్నలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయని విద్యార్థులు కూడా విశ్వవిద్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పరీక్షను రద్దు చేసిన అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే 100 మందికిపైగా పోలీసులు, సైబర్ నిపుణులు రంగంలోకి దిగారు. దుర్గ్‌లోని భారతీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ యోగేశ్ సోన్‌కేసరియా, విద్యార్థులు అజయ్ నాయక్, త్రిదేవ్ పటేల్, నితిన్ పాండే, అనుజ్ మింజ్, ఆదిత్య సాహులను అరెస్టు చేశారు. ఫిర్యాదు అందిన 36 గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. ఎంటమాలజీ ప్రశ్నపత్రాలు ఉన్న సీల్డ్ కవర్‌కు ప్రొఫెసర్ యోగేశ్ చిన్న రంధ్రం చేసి.. ఎండోస్కోపిక్ కెమెరా ద్వారా ఫొటోలు, వీడియోలు తీసినట్లు గుర్తించారు. అనంతరం ఆ పేపర్‌ను అజయ్ నాయక్, మరో ఇద్దరు విద్యార్థులకు రూ.11 వేలకు అమ్మినట్లు ఆరోపణలు ఉన్నాయి. అజయ్ ఆ పేపర్‌ను మిగతావారితో పంచుకున్నట్లు సమాచారం. నిందితుల నుంచి రూ.11 వేల నగదు, ఆరు ఫోన్లు, వీడియో రికార్డర్, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.**



# ఒడిశా తీరంలో మునిగిన నౌక.. 22 మంది గల్లంతు



పనామాకు చెందిన రవాణా నౌక ప్రమాదవశాత్తు ఒడిశా తీరంలో మునిగిపోయింది. తీరానికి 240 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దాదాపు 1700 టన్నుల ఐరన్ ఓర్ లోడుతో 'ఎంవీ ఓషియన్ విన్నర్' నౌక ఆగస్టు 20 రాత్రి 10.30 గంటల సమయంలో పారాదీప్ నుంచి సింగపూర్‌కు బయల్దేరింది. ఆగస్టు 22 (శనివారం) ఉదయం 11.48 గంటల తర్వాత నౌకతో సంబంధాలు తెగిపోయాయి.

తాము ప్రమాదంలో చిక్కుకున్నట్లు నౌక సిబ్బంది చివరిగా సమాచారం ఇచ్చారు. ఈ నౌకలో 24 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో 20 మంది చైనీయులుకాగా.. ముగ్గురు మయన్మార్, ఒకరు బంగ్లాదేశ్‌కు చెందినవారు. సమాచారం అందుకున్న ఇండియన్ కోస్టుగార్డ్, ఇండియన్ నేవీ బృందాలు సహాయక చర్యలు ముమ్మరం చేశాయి. ఇప్పటి వరకు ఇద్దర్ని కాపాడినట్లు సమాచారం.

# 8.7 కోట్ల మంది యువతకు 'పని'లేదు



దేశంలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న వారిలో 8.7 కోట్ల మంది యువత పని లేకుండా ఉన్నారు. వారు చదవడం లేదు.. పని చేయడం లేదు.. ఎటువంటి శిక్షణా తీసుకోవడం లేదు. ఇందుకు వారి ఆర్థిక పరిస్థితులు కారణంగా కనిపిస్తున్నాయి. 'వికసిత్ భారత్ కోసం నైపుణ్యాభివృద్ధి పునఃకల్పన 2047' పేరుతో నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. 2021లో సేకరించిన 78వ జాతీయ శాంపిల్ సర్వే ఆధారంగా ఈ నివేదికను నీతి ఆయోగ్ తయారు చేసింది.

ఆర్థిక ఇబ్బంది..

చదువుకోని, ఉద్యోగాల్లో లేని, శిక్షణ తీసుకోని యువత.. ఆదాయం లేక, గతంలో తాము చదువుకు ఖర్చు పెట్టిన వ్యయాన్ని భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ఆర్థిక బాధ్యతల కారణంగా విద్యార్థులు తగినంత నైపుణ్య శిక్షణ పొందలేకపోతున్నారు. తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాల్లోని విద్యార్థులు ఇప్పటికే విద్యా భారాన్ని, ప్రైవేటు ట్యూషన్ల భారాన్ని మోస్తున్నారు. ఫలితంగా సంప్రదాయ డిగ్రీలకు అదనపు నైపుణ్యాలను పెంచుకోవడానికి ఖర్చు పెట్టడం సాధ్యం కావడం లేదు. దీనివల్ల చాలా మంది విద్యార్థులు తమ సంప్రదాయ కోర్సులను పూర్తి చేయగానే తక్కువ వేతనాలకే ఏదో ఒక ఉద్యోగంలో చేరి కుటుంబ పోషణకు తోడ్పడుతున్నారు. మిగిలిన వారు ఉపాధి లేకుండా కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

**8.5శాతం మందికే తగిన పని**

దేశంలో 8.5 శాతం మంది గ్రాడ్యుయేట్లకే తమ అర్హతకు తగిన ఉపాధి దొరుకుతోంది. ఎక్స్‌పోజర్, ప్రాక్టికల్ శిక్షణ లేకపోవడం, పరిశ్రమలతో అనుసంధాన లేమివల్ల ఉపాధి అవకాశాలు పరిమితమవుతున్నాయి. నేర్చుకో, సంపాదించు, నిరంతరాయంగా ముందుకెళ్లు.. నైపుణ్యాభివృద్ధి అనేవి వికసిత్ భారత్‌కు అవసరం. 201415 నుంచి ఇప్పటిదాకా 7.67 కోట్ల మందే సరైన శిక్షణ తీసుకోగలిగారు.

**5 విభాగాలుగా..**

దేశంలోని కార్మిక శక్తి, అభ్యాసకులను 5 విభాగాలుగా సంస్థ విభజించింది. అవి..

పాఠశాల విద్య.

ఉన్నత విద్య.

సంఘటిత, అసంఘటిత రంగ పని.

చదువుకోని, ఉద్యోగాల్లో లేని, శిక్షణ తీసుకోని యువత.

మహిళలు.

శిక్షణ అవసరం

పని లేని యువత, మహిళలకు చౌకగాగానీ, సబ్సిడీతోగానీ శిక్షణ అందించాల్సి ఉంది.

పరిస్థితులు అత్యంత తీవ్రంగా ఉన్నచోట ఆర్థిక సాయమూ అందించాలి.

అనేక చోట్ల లెర్నింగ్ విత్ ఎర్నింగ్ అనేది ప్రధాన అవసరంగా ఉంది.

కార్మిక శక్తి, పని లేని వారికి కెరీర్ మధ్యలో నైపుణ్యాలను పెంచుకోవడం అవసరంగా మారుతోంది. స్థానిక డిమాండ్, అభివృద్ధి చెందుతున్న రంగాల్లో స్వయం ఉపాధి, అభ్యసన అవకాశాలను ఇది గుర్తు చేస్తోంది.

# వినాయక ఊరేగింపులో అపశ్రుతి..ఇద్దరి మృతి



వినాయక విగ్రహ ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీ విగ్రహాన్ని ఊరేగింపుతో తరలిస్తున్న సమయంలో కింద పడడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన మహారాష్ట్రలోని ముంబయిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి దక్షిణ ముంబయిలోని భులేశ్వర్‌కు 22 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకురావడానికి ఏర్పాట్లు చేశారు. రాత్రి 10 గంటల సమయంలో విగ్రహాన్ని తరలిస్తుండగా..బలరామ్ మర్చంట్ రోడ్డుపై వాహనం కుదుపులకు గురై కిందపడిపోయింది. దాని కింద నలిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించారు. మృతులను సంకేత్ నెవ్‌షే (33), బ్రిజేష్ హేమంత్ జోషి (30)గా గుర్తించారు.

# బతికున్న మహిళ చనిపోయిందని గదికి తాళం వేసిన పోలీసులు

**ఛత్తీస్‌గఢ్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఓ మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించకుండానే చనిపోయినట్లు పోలీసులు నిర్ధారించిన ఘటన కలకలం రేపుతోంది. ఆ గదిలోకి మరెవరూ వెళ్లకుండా పోలీసులు తాళం కూడా వేశారు. దాదాపు 2-3 గంటల తర్వాత పంచనామా వంటి చట్టపరమైన ప్రక్రియల కోసం పోలీసులు తలుపులు తెరవగా ఆ మహిళ ఇంకా ఊపిరి తీసుకొంటూనే ఉంది. బెమెతరా జిల్లాలోని కొత్వాలి పోలీస్‌స్టేషను పరిధి పరుశురామ్ చౌక్‌లో ఈ ఘటన జరిగింది. ఆమెలో కదలికలు కనిపించగానే కుటుంబసభ్యులు ఉరితాడు నుంచి కిందకు దించి, హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్స కొనసాగుతోంది. పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై పోలీసుశాఖ నుంచి అధికారికంగా ఎటువంటి స్పందన వెలువడలేదు.**



# మహిళలూ పంజరం వీడండి

**- పితృస్వామ్యాన్ని బద్దలు కొట్టాలని రాహుల్ పిలుపు**

**- మనుస్మృతి నియమం సిగ్గుచేటని వ్యాఖ్య**

మహిళలు.. వారికి వారే సొంతమని, వారు తండ్రులకు, భర్తలకు, కుమారులకు చెందినవారు కాదని, అలా ప్రతి దశలో పురుషుల ఆధిపత్యం కింద ఉండాలని పేర్కొంటున్న మనుస్మృతి నియమం సిగ్గుచేటని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. జంతర్ మంతర్ దగ్గర అమ్మాయిలు కూడా దుర్భాషలాడటం చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించడం ఆయన మనుస్మృతి మనస్తత్వానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మోదీ చేసిన వ్యాఖ్యలను ఆయన తెరపై ప్రదర్శించారు. దేశానికి అతిపెద్ద బలం 70 కోట్ల మంది మహిళల జీవన యానమని, వారి అద్వితీయ ఊహలు, కలలని అభిప్రాయపడ్డారు. పుణెలో శనివారం జరిగిన ఛాత్రోం కీ గూంజ్‌లో (విద్యార్థుల ప్రతిధ్వని) ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి భారీగా యువతులు హాజరయ్యారు. ''మనుస్మృతిని ఇక్కడ ప్రస్తావిస్తున్నా. అందులో బాల్య దశలో అమ్మాయి తండ్రికి విధేయురాలిగా ఉండాలని ఉంది. యుక్త వయసులో భర్తకు లోబడి ఉండాలని ఉంది. భర్త చనిపోయాక కుమారుడి ఆశ్రయం పొందాలని ఉంది. ఆమె ఎప్పుడూ స్వతంత్రురాలిగా లేదు. మనుస్మృతిలోని ఈ నియమాలు సిగ్గుచేటు. వాటి గురించి మాట్లాడకూడదు'' అని రాహుల్ పేర్కొన్నారు.

మీరే దేశానికి అతి పెద్ద ఆస్తి: ''మీరే దేశానికి అతి పెద్ద ఆస్తి. మీరు మీ కోసమే నిలవాలి. మీపై మీరే నమ్మకం ఉంచుకోవాలి. మీరు ఎవరికీ చెందినవారు కాదు. మీకే చెందినవారు. తండ్రి, సోదరుడు, భర్త, కుమారుడితో మీకు బంధుత్వమే ఉంది. అంతేగానీ మీరు వారికి చెందినవారు కాదు'' అని రాహుల్ స్పష్టం చేశారు. పంజరం నుంచి యువత బయటకు రావాలని రాహుల్ పిలుపునిచ్చారు. పితృస్వామ్యాన్ని బద్దలు కొట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ వారికే ప్రత్యేకమైన కలలు, విజన్ ఉంటాయని తెలిపారు. పురుషులతో పోలిస్తే సహజంగానే మహిళలు మరింత సున్నితత్వంతో, కరుణతో, ముందుచూపుతో ఉంటారని పేర్కొన్నారు. మహిళలకు మూడు రకాలుగానే గుర్తింపు దక్కుతోందని, కుమార్తెగా, భార్యగా, తల్లిగానే గుర్తిస్తున్నారని, ఆ బంధాల్లో తప్పులేదని, అయితే అదొక్కటే వారి గుర్తింపుగా ఉండకూడదని రాహుల్ స్పష్టం చేశారు.

**పంజరం నుంచి బయటకు రండి**

పంజరం నుంచి యువత బయటకు రావాలని రాహుల్ పిలుపునిచ్చారు. పితృస్వామ్యాన్ని బద్దలు కొట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ వారికే ప్రత్యేకమైన కలలు, విజన్ ఉంటాయని తెలిపారు. పురుషులతో పోలిస్తే సహజంగానే మహిళలు మరింత సున్నితత్వంతో, కరుణతో, ముందుచూపుతో ఉంటారని పేర్కొన్నారు. మహిళలను మూడు రకాలుగానే గుర్తింపు దక్కుతోందని, కుమార్తెగా, భార్యగా, తల్లిగానే గుర్తిస్తున్నారని, ఆ బంధాల్లో తప్పులేదని, అయితే అదొక్కటే వారి గుర్తింపుగా ఉండకూడదని రాహుల్ స్పష్టం చేశారు. మహిళలు వృత్తి నిపుణులుగా, క్రీడాకారులుగా, ఎన్నో రంగాల్లో క్రియాశీలంగా ముందుకు సాగుతున్నారని, కానీ వారి గుర్తింపును పురుషులతో ముడిపెట్టి చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అబ్బాయిలు అభ్యంతరకర భాష వాడితే అనుమతిస్తారని, అదే అమ్మాయిలు మాట్లాడితే సాంస్కృతిక షాక్ అని తప్పుపడతారని వ్యాఖ్యానించారు.

మహిళలు మూడు రకాల హింసకు గురవుతున్నారని, అందులో భౌతిక హింస, అవకాశాలను నిరాకరించడం ద్వారా హింస, ఆర్థిక హింస ఉన్నాయని తెలిపారు.

దేశంలో ఏటా 4.5 లక్షల ఆడ భ్రూణ హత్యలు జరుగుతున్నాయని, 80శాతం మంది వేధింపుల బారిన పడుతున్నారని, 29శాతం మంది భౌతిక హింసకు గురవుతున్నారని, 6శాతం మందిపై అత్యాచారాలు జరుగుతున్నాయని, 99శాతం లైంగిక వేధింపుల కేసులు వెలుగుచూడటం లేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశంలో 60శాతం మంది మహిళలు ఇప్పటికీ ఒంటరిగా బయటకు వెళ్లలేకపోతున్నారని తెలిపారు.



బాలికలు రాత్రి 8కల్లా ఇంటికి రావాల్సి వస్తోందని, అదే బాలురు ఏ సమయంలోనైనా తిరగడానికి స్వేచ్ఛ ఉందని వెల్లడించారు.

15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న అమ్మాయిలు ఇంట్లో సగటున రోజుకు 5.5 గంటలు పని చేయాల్సి వస్తోందని, అదే అబ్బాయిలు 30 నిమిషాలకు మంచి పని చేయడం లేదని పేర్కొన్నారు.

పేపర్ లీక్‌లతో మహిళలకే ఎక్కువ నష్టం పేపర్ లీక్‌ల కారణంగా మహిళా అభ్యర్థులకే అధిక నష్టం జరుగుతోందని రాహుల్ గాంధీకి మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. పరీక్షల ఆలస్యంవల్ల తమపై వివాహం, కుటుంబ ఒత్తిడి పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. లీక్ కారణంగా పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండు చేస్తున్న తమకు మద్దతివ్వాలని కోరారు.

**డబ్బులిచ్చి తరలించారు: భాజపా**

రాహుల్ గాంధీ నిర్వహించిన విద్యార్థుల ప్రతిధ్వని కార్యక్రమానికి డబ్బులు పంచి జనాన్ని తరలించారని కేంద్ర మంత్రి, భాజపా నేత మురళీధర్ మొహోల్ ఆరోపించారు.




# పర్యావరణ చట్టానికి తూట్లు

చట్టాలలో ప్రజాప్రయోజన చట్టాలకు ఒక విశిష్ట స్థానం ఉంది. వాటికి ఒక సామాజిక కోణం ఉంటుంది. అలాగే ఆ చట్టాన్ని ఉదారంగా నిర్వచించాల్సి వస్తుంది. అయితే ఆ ఉదారత ఆ చట్టం ఎవరి కోసం అయితే నిర్దేశించిందో వారికి అనుకూలంగా ఉండాలి కానీ, ఆ చట్టాన్నే నిర్వీర్యం చేసేటట్టు ఉండకూడదు. సుప్రీంకోర్టు జూలై 29న వనశక్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇచ్చిన తీర్పు ఒక ప్రజాప్రయోజనార్థ చట్టాన్ని ఆ చట్టం ఉద్దేశాలకు, మౌలిక స్వభావానికి భిన్నంగా నిర్వచించింది. ఆ చట్టం పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986.

పర్యావరణ పరిరక్షణ చట్టం కింద 1994లో పర్యావరణ ప్రభావ అంచనా ఉత్తర్వును విడుదల చేశారు. అందులోని షెడ్యూల్‌లో 'ఏ ప్రాజెక్టు కొత్తగా మొదలుపెట్టాలన్నా, ఉన్న ప్రాజెక్టును విస్తరించాలన్నా పర్యావరణ అనుమతి లేకుండా చేయడం కుదరదు' అని ఉంది. 2006లో తెచ్చిన కొత్త ఉత్తర్వులోనూ చాలా స్పష్టంగా– ఏ ప్రాజెక్టు మొదలుపెట్టాలన్నా ముందస్తు పర్యావరణ అనుమతి తప్పనిసరి అని ఉంది. అంటే 1994లో అంతర్లీనంగా ఉన్నది, 2006 నాటికి ప్రస్ఫుటంగా ఉంది. అయితే ఈ చట్టాన్ని ఉల్లంఘించేవారిలో బలమైన పెట్టుబడిదారులు ఉన్నారు. వారు ఎటువంటి పర్యావరణ అనుమతి లేకుండా తమ ప్రాజెక్టులను నిర్మించడమేగాక, కొందరైతే నిర్మాణం పూర్తిచేసి ఆ పరిశ్రమలను నడిపేస్తున్నారు కూడా.

అలా అనుమతి లేకుండా నిర్మాణాలు చేసిన వారికి ఊరటగా కేంద్ర పర్యావరణ శాఖ 1994 నుంచి సడలింపు ఇస్తూ వచ్చింది. ఆ సడలింపు ప్రకారం, 'నిర్మాణం మొదలుపెట్టేశాక, లేదా పూర్తి చేసేశాక కూడా పర్యావరణ అనుమతి తీసుకోవచ్చు!' దీనిని 'ఎక్స్‌పోస్ట్ ఫ్యాక్టో' అనుమతి అంటారు. అటువంటి సడలింపులు చట్ట విరుద్ధమనీ, అలా చేయడానికి ఏ మాత్రం కుదరదనీ 2004 నుంచి సుప్రీంకోర్టు పలుమార్లు చాలా స్పష్టంగా చెబుతూ వచ్చింది. అయినా పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన మంత్రిత్వశాఖ 2017లో అటువంటి సడలింపు ఉత్తర్వును పర్యావరణ పరిరక్షణ చట్టం కింద మరొక్కసారి ఇచ్చింది. 2017 మార్చి 14 నాటికి అనుమతి లేకుండా నిర్మిస్తున్న లేదా నిర్మించినవారు తదుపరి ఆరు నెలల్లో అనుమతి తెచ్చుకోవటానికి అవకాశం కల్పించారు. ఈ ఆరు నెలలు కాస్తా 13 నెలలు అయ్యింది. అనుమతి లేకుండా ఇలా నిర్మించిన పరిశ్రమల్లో పర్యావరణ విధ్వంసకరమైనవి ఉంటాయి, ఈ పాటికే అవి చాలా నష్టం చేసి ఉంటాయి అనే సందేహం ఈ ఉత్తర్వు ఇచ్చినవారికి కలిగినట్టు మనకు అనిపించదు. అంతేగాక 'ఈ ఉత్తర్వును పర్యావరణ పరిరక్షణ కోసం ఇస్తున్నాం' అని రాసుకొచ్చారు! ఇది కేవలం ఈ ఒక్కసారికి మాత్రమే అని కూడా చెప్పారు. ప్రతిసారి ఈ ఒక్కసారికే అని చెప్పటం ఈ పాటికి పరిపాటి అయ్యింది.

మళ్లీ 2021లో ఒక ఆఫీస్ మెమోరాండం ఇచ్చారు. దాని ప్రకారం... అనుమతి లేకుండా మొదలుపెట్టినవారు ఏ భయం లేకుండా ఇప్పుడు అనుమతులు తీసుకోవచ్చు అని. ఇది చట్టం కింద ఇచ్చిన ఉత్తర్వు కాదు. అలాగే 2017 నాటి ఉత్తర్వులో లాగా ఇది ఒకసారికి మాత్రమే అని కూడా లేదు. అంటే, ఒక రకంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియకే చమరగీతం పాడిన మెమోరాండం ఇది.

ఈ రెండిటినీ ముందుగా మద్రాస్ హైకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునళ్లలో ఛాలెంజ్ చేశారు. హైకోర్టు, ట్రిబ్యునల్ దాటుకుని ఈ వన శక్తి కేసు సుప్రీంకోర్టు వరకూ వచ్చింది. మే 14, 2025న సుప్రీంకోర్టు ధర్మాసనం దీని గురించి ఒక అద్భుతమైన తీర్పు ఇచ్చింది– ఇటువంటి ఉత్తర్వులు, మెమోరాండంలు ఇవ్వడమంటే పక్కదారిలో పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని నీరుగార్చడమే అని, చట్టం ఉద్దేశం పరిరక్షణ అయితే విధ్వంసకర ప్రాజెక్టులకు పరిరక్షణ చట్టం కింద సడలింపు ఇవ్వడం ఎలా కుదురుతుందని తెలిపింది. అంతేగాక, సుప్రీంకోర్టు ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు 'ఇటువంటి సడలింపులు కుదరవు' అని చెప్పిన విషయాన్ని ఉటంకిస్తూ పర్యావరణ, న్యాయ సిద్ధాంత మేళవింపుగా తీర్పు ఇచ్చింది. 2017 నాటి ఉత్తర్వుని, 2021 నాటి మెమోరాండంను కొట్టివేసింది. భవిష్యత్తులో ఇటువంటి ఉత్తర్వులు లేదా మెమోరాండంలు ఇవ్వడానికి వీలులేదని కూడా చాలా స్పష్టంగా తెలియజేసింది.

ఈ తీర్పు మీద రియల్ ఎస్టేట్ లాబీ సంస్థ క్రెడాయ్ సమీక్ష కోరింది. ఇక్కడ గమనించాల్సింది ఈ కేసులో ప్రధాన పార్టీ అయిన కేంద్ర ప్రభుత్వం ఈ తీర్పును ఒప్పకుంది. వారు కోరని సమీక్ష క్రెడాయ్ కోరింది. సమీక్ష తీర్పును ముగ్గురు సభ్యుల ధర్మాసనం వెలువరించింది. ఇద్దరు న్యాయమూర్తులు ఈ కేసును మళ్లీ వినాలి అని తీర్మానించగా, ఒక న్యాయమూర్తి మాత్రం ఇచ్చిన తీర్పు సరైనదే అని నవంబర్ 18, 2025న తీర్పు చెప్పారు. దానితో ఈ కేసు మళ్లీ ముగ్గురు సభ్యుల ధర్మాసనం దగ్గరికి వెళ్లింది. ఈ ధర్మాసనం జూలై 29న తన మలి తీర్పు ప్రకటించింది.

ఈ మలి తీర్పులో మొదటి తీర్పులో చెప్పినట్టుగా ఎక్స్‌పోస్ట్ ఫ్యాక్టో అనుమతులకు చట్టంలో స్థానం లేదు అని స్పష్టం చేశారు. ఆఫీస్ మెమోరాండంను కూడా కొట్టివేశారు. అంతవరకే చేసి ఉంటే మొదటి తీర్పును ఎత్తిచూపుతూ, పర్యావరణ పరిరక్షణ చట్టం ఉద్దేశాలకూ, మౌలిక స్వభావానికి అనుగుణంగా ఉండేది. అయితే దానితో పాటు ముందస్తు అనుమతి నుంచి కొన్ని పరిస్థితులలో సడలింపు ఇవ్వవచ్చు అని రాసుకొచ్చారు. దానికి ఒక ప్రాతిపదిక కూడా ఇచ్చారు. ఇక్కడ ఒక విషయం చెప్పకోవాలి. ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నప్పుడు అలా కాకుండా మరో విధంగా చేయడానికి వీలులేదు అని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తేల్చి చెప్పి నాలుగు దశాబ్దాలు అవుతుంది. అది పర్యావరణ అనుమతి అయినా మరొకటి అయినా. అయితే పర్యావరణ అనుమతి విషయంలో అది మరింత ముఖ్యం. ఎందుకంటే ఒకసారి విధ్వంసం జరిగాక దానిని తిరిగి మునుపటి స్థితికి తీసుకురావటం అసంభవం కాబట్టి. అందులోనూ వాతావరణ మార్పు ప్రధానంగా ఉన్న ఈ కాలంలో ఆ జాగరూకత, జాగ్రత్త మరింత అవసరం. అయినా కూడా చట్టంలో లేని, అలా కుదరదు అని రాజ్యాంగ ధర్మాసనం చెప్పినా కూడా 'ప్రజా ప్రయోజనం' పేరు మీద ఒక ప్రాతిపదిక ఏర్పాటు చేయడం అవాంఛనీయం. అంతే కాక, 1994 లేదా 2006 నాటి ఉత్తర్వు చట్టంలోని పర్యావరణ పరిరక్షణ సూత్రం కింద తీసుకువచ్చిన ఉత్తర్వు. ఇప్పుడు అదే సూత్రం కింద అదే ఉత్తర్వును నీరుగారుస్తూ... మరొక ఉత్తర్వు ఇవ్వడంలో అసంబద్ధత లేదు అని చెప్పడం ఏ మాత్రం ఆమోదయోగ్యం? భారతదేశంలో పర్యావరణ చట్ట సిద్ధాంతాన్ని పార్లమెంట్ కన్నా కూడా సుప్రీంకోర్టే అభివృద్ధి చేసిందని చెప్పడం అతిశయోక్తి కాదు. 1990ల్లో ఇచ్చిన పలు తీర్పుల ద్వారా పర్యావరణ సిద్ధాంతానికి సంబంధించిన అనేక విషయాలను సుప్రీంకోర్టే క్రోడీకరించి, జీవించే హక్కులో భాగం చేసింది. ఒకప్పుడు గురుతర బాధ్యతను పోషించిన కోర్టే ఈ రోజు దానికి విరుద్ధంగా కాకపోయినా భిన్నంగా ప్రవర్తించడం బాధాకరం, ప్రమాదకరం కూడా.



# క్యాంపస్ నుంచి నిరసన వరకు: యువత గొంతుకగా రాహుల్ గాంధీ

**విద్య, భద్రత, ఉపాధి, గౌరవం, ప్రజాస్వామ్య హక్కులు వంటి అంశాలను భారత యువత ప్రధానంగా ప్రజా చర్చలోకి తీసుకొస్తోంది. కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులు, యువతులు, యువతతో సాగిస్తున్న ఇటీవలి సంభాషణలు ఈ మారుతున్న రాజకీయ చర్చకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయి.ఆగస్టు 22న పుణెలో జరిగిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో మహిళా విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడం, ఆర్థిక స్వావలంబన సాధించడంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను బహిరంగంగా వెల్లడించారు. లైంగిక వేధింపులు, సురక్షితం కాని ప్రజా రవాణా, వ్యక్తిగత భద్రత, విద్య పెరుగుతున్న వ్యయం వంటి అంశాలను వారు ప్రస్తావించారు.ఈ సంభాషణ ఒక ముఖ్యమైన వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చింది. విద్య అందుబాటులో ఉండటం అంటే కేవలం కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఉండటం మాత్రమే కాదు. యువతులు సురక్షితంగా చదువుకోగలరా, కళాశాలకు వెళ్లి రావచ్చా, ఉన్నత విద్య ఖర్చులను కుటుంబాలు భరించగలవా అన్న అంశాలు కూడా విద్యా అవకాశాలను నిర్ణయిస్తాయి.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు హాజరు కావడం, దీనికి లభించిన స్పందన యువత రాజకీయ ఆకాంక్షలకు మరోసారి ప్రాధాన్యతను తెచ్చింది. సురక్షితమైన క్యాంపస్‌లు, అందుబాటులో ఉండే విద్య, ఉపాధి అవకాశాలు, వేధింపుల నుంచి విముక్తి, తమ జీవితాలపై స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే హక్కు వంటి అంశాలు విద్యార్థుల దృష్టిలో అత్యంత కీలకమైనవిగా మారుతున్నాయి.**





మహిళా స్వేచ్ఛ, ఆర్థిక స్వావలంబన

పూణే లో జరిగిన సంభాషణ సందర్భంగా రాహుల్ గాంధీ మహిళల స్వయం నిర్ణయాధికారాన్ని ప్రస్తావిస్తూ, పితృస్వామ్య సామాజిక నిర్మాణాల పరిమితులకు లోబడకుండా మహిళలు తమ జీవితాలపై తామే నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలని అన్నారు. భారతదేశ మహిళలు దేశానికి గొప్ప బలమని పేర్కొంటూ, యువతులు తమపై తాము నమ్మకం పెంచుకుని హక్కుల కోసం నిలబడాలని పిలుపునిచ్చారు. అయితే విద్యార్థులు లేవనెత్తిన సమస్యలు కేవలం రాజకీయ ప్రసంగాల పరిధిలోకి వచ్చే అంశాలు కావు. లైంగిక వేధింపులు, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, ఆర్థిక పరిమితులు యువతులు తమ విద్యను కొనసాగించాలా, ఉద్యోగాల్లోకి ప్రవేశించాలా, ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలా అన్న విషయాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి.అందువల్ల మహిళల భద్రత కేవలం సామాజిక సమస్య మాత్రమే కాదు; అది విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశం కూడా.ఒక యువతి కళాశాలకు సురక్షితంగా వెళ్లలేకపోతే, ఉన్నత విద్యను భరించలేకపోతే లేదా సురక్షితమైన ఉద్యోగ వాతావరణం పొందలేకపోతే, ఆమెకు సమాన అవకాశాలు వాస్తవంగా నిరాకరించబడుతున్నట్లే.విద్యార్థులు తమ సమస్యలను భయపడకుండా వెల్లడించగలిగే సంస్థాగత వ్యవస్థల అవసరాన్ని కూడా ఈ చర్చ స్పష్టం చేసింది. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సురక్షితమైన క్యాంపస్‌లు, సమర్థవంతమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు, జవాబుదారీతనం కలిగిన అధికార వ్యవస్థలు, విద్యార్థులకు అందుబాటులో ఉండే సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**తరగతి గది నుంచి వీధి పోరాటం వరకు**

విద్యార్థులతో రాహుల్ గాంధీ సాగిస్తున్న సంభాషణ విద్య, సామాజిక సమస్యలకు మాత్రమే పరిమితం కాలేదు. అది నిరసన తెలిపే హక్కు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి ప్రజాస్వామ్య అంశాల వరకు విస్తరించింది.జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనలో గాయపడిన విద్యార్థి సాహిల్ లోచబ్‌కు సంబంధించిన కేసులో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 21న న్యూఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ సుదీర్ఘంగా ధర్నా చేపట్టారు. అనంతరం ఢిల్లీ పోలీసులు లోచబ్ ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.నజాఫ్‌గఢ్‌కు చెందిన యువ విద్యార్థి లోచబ్ నిరసన సందర్భంగా తనకు అనేక పెల్లెట్ గాయాలు తగిలాయని, కుడి కంటికి చూపు కోల్పోయానని ఆరోపించారు. ప్రమాదకర మార్గాల ద్వారా గాయపరచడం, ప్రాణాలకు లేదా వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగించడం వంటి ఆరోపణలకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత నిబంధనల కింద ఎఫ్ఐఆర్ నమోదైంది.లోచబ్, అతని కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన రాహుల్ గాంధీ, ఫిర్యాదు అధికారికంగా నమోదు అయ్యే వరకు అక్కడే ఉన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు కావడం న్యాయం దిశగా తొలి అడుగు మాత్రమేనని ఆయన పేర్కొంటూ, విద్యార్థుల నిరసనలపై బలప్రయోగం చేయడాన్ని ప్రశ్నించారు.ఈ ఘటన రాజకీయ వివాదానికి కూడా దారితీసింది. గాయపడిన విద్యార్థికి న్యాయం, జవాబుదారీతనం కోసం రాహుల్ గాంధీ నిరసన చేపట్టారని కాంగ్రెస్ నేతలు పేర్కొనగా, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి దీనిని రాజకీయ నాటకంగా విమర్శించారు.

**అసమ్మతి తెలిపే హక్కు**

ఈ ఘటన ప్రజాస్వామ్యంలో అసమ్మతికి ఉన్న స్థానం అనే విస్తృతమైన ప్రశ్నను ముందుకు తెచ్చింది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో విద్యార్థి ఉద్యమాలకు ప్రత్యేక స్థానం ఉంది. విశ్వవిద్యాలయాలు కేవలం విద్యను అందించే కేంద్రాలు మాత్రమే కావు. యువత రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకునే, అధికారాన్ని ప్రశ్నించే, సమాజ భవిష్యత్తుపై భిన్నమైన అభిప్రాయాలను చర్చించే ప్రజాస్వామ్య వేదికలు కూడా. అయితే శాంతియుత నిరసన హక్కుతో పాటు ప్రజా శాంతిని కాపాడే బాధ్యత కూడా ఉంటుంది. అదే సమయంలో, చట్టబద్ధమైన నిరసనలను ప్రభుత్వం సముచితమైన, పరిమితమైన విధానంలో నిర్వహించాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది. బలప్రయోగం అధికమైందన్న ఆరోపణలు వస్తే వాటిపై స్వతంత్రంగా దర్యాప్తు జరగడం కూడా అత్యంత అవసరం.ఎఫ్ఐఆర్ నమోదు కావడం నేరం రుజువైనట్లు కాదు. అది చట్టపరమైన ప్రక్రియకు ఆరంభం మాత్రమే. ఆరోపణలపై దర్యాప్తు జరిపి, ఆధారాలను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఫిర్యాదులను అధికారికంగా నమోదు చేయడానికి సంస్థలు సిద్ధంగా ఉండటం కూడా ప్రజా జవాబుదారీతనంలో కీలకమైన అంశం.

**'భారత భవిష్యత్తు'గా యువత**

యువత తరానికి రాజకీయ స్వరంగా తనను తాను నిలబెట్టుకునే ప్రయత్నాన్ని రాహుల్ గాంధీ ఇటీవలి కాలంలో మరింతగా చేస్తున్నారు. యువతను భయపెట్టి మౌనంగా ఉంచలేమని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో వారు చురుకైన పాత్ర పోషించాలని ఆయన చెబుతున్నారు.ఇది భారత రాజకీయాల్లో మారుతున్న వాస్తవ పరిస్థితిని కూడా ప్రతిబింబిస్తోంది. భారత యువత ఒక భారీ సామాజిక, రాజకీయ, ఎన్నికల శక్తి. అయితే వారి సమస్యలను కేవలం ఎన్నికల లెక్కలకే పరిమితం చేయలేం.నాణ్యమైన విద్య, ఉపాధి, గౌరవప్రదమైన జీవితం, భద్రత, సాంకేతిక అవకాశాలు, తమ జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాల్లో తమకూ భాగస్వామ్యం వంటి అంశాలను యువత కోరుకుంటోంది.అందువల్ల రాజకీయ సవాలు కేవలం ఎన్నికల సమయంలో యువతను సమీకరించడం కాదు. ప్రజా జీవితంలో వారు అర్థవంతంగా పాల్గొనేలా శాశ్వతమైన ప్రజాస్వామ్య వేదికలను సృష్టించడం కూడా.

**రాజకీయ సమీకరణకు అతీతంగా**

విద్యార్థులతో జరుగుతున్న ఇటీవలి సంభాషణలు రాజకీయ నాయకత్వం పాత్రపై కూడా ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి.రాజకీయ పార్టీలు కేవలం ఓట్లు కోరే సంస్థలుగా కాకుండా యువత మాట వినే నిజమైన వేదికలుగా మారగలవా? విద్య, ఉపాధి, భద్రతపై విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను స్పష్టమైన ప్రజా విధానాలుగా మార్చగలరా? సామాజిక ఉద్యమాలతో రాజకీయ నాయకులు వాటిని నియంత్రించే ప్రయత్నం చేయకుండా నిర్మాణాత్మకంగా కలిసి పనిచేయగలరా?మహిళా విద్యార్థుల విషయంలో ఈ ప్రశ్నలు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. వేధింపులు, సురక్షితం కాని రవాణా, ఆర్థిక పరిమితులపై వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు కేవలం చట్టాలు చేయడం ద్వారా సామాజిక సమానత్వం సాధ్యం కాదని సూచిస్తున్నాయి. దీనికి సంస్థాగత మార్పులు, మెరుగైన ప్రజా మౌలిక వసతులు, సామాజిక దృక్పథాల్లో మార్పు, ఆర్థిక అవకాశాల విస్తరణ అవసరం.

**మారుతున్న రాజకీయ సంభాషణ**

పుణెలో జరిగిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం నుంచి సాహిల్ లోచబ్‌కు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన వరకు రాహుల్ గాంధీ ఇటీవల చేపట్టిన కార్యక్రమాలు సమకాలీన రాజకీయాల్లో పరస్పరం అనుసంధానమైన రెండు విభిన్న కోణాలను ప్రతిబింబిస్తున్నాయి. ఒకటి పౌరుల మాట వినడం——ముఖ్యంగా మరింత స్వేచ్ఛ, భద్రత, ఆర్థిక స్వావలంబన కోరుకుంటున్న యువతుల గొంతుకను వినడం. మరొకటి ప్రభుత్వ సంస్థల నుంచి జవాబుదారీతనం కోరుతున్న పౌరుల పక్షాన నిలబడటం.ఈ రాజకీయ విధానం భవిష్యత్తులో స్థిరమైన ప్రజా మద్దతుగా మారుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. అయితే విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలు మాత్రం అంత సులభంగా కనుమరుగయ్యే అవకాశం లేదు.భారత యువత నుంచి వెలువడుతున్న సందేశం స్పష్టంగా ఉంది: విద్య అందరికీ అందుబాటులో ఉండాలి, క్యాంపస్‌లు సురక్షితంగా ఉండాలి, మహిళలు తమ జీవితాలపై స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే హక్కు కలిగి ఉండాలి, పౌరులు భయపడకుండా అధికారాన్ని ప్రశ్నించే స్వేచ్ఛను కలిగి ఉండాలి.భారత ప్రజాస్వామ్యానికి అత్యంత ముఖ్యమైన ప్రశ్న యువత తరఫున ఎవరు మాట్లాడుతున్నారు అనేది మాత్రమే కాదు. యువత మాట వినడానికి, వారి సమస్యలకు స్పందించడానికి, దేశ భవిష్యత్తును నిర్మించడంలో వారికి అర్థవంతమైన పాత్ర కల్పించడానికి రాజకీయ వ్యవస్థ సిద్ధంగా ఉందా? అన్నదే అసలు ప్రశ్న.

**డా. ముచ్చుకోట సురేష్ బాబు,**
**9989988912**

# ఎడారి నేలకు పచ్చటి ప్రహరీ!

**ప్రపంచంలోనే అతి పొడవైన 'గ్రేట్ వాల్ ఆఫ్ చైనా' గురించి మనకు తెలుసు! కానీ ఆఫ్రికాలో నిర్మిస్తున్న 'గ్రేట్ గ్రీన్ వాల్' గురించి విన్నారా? అచ్చంగా చెట్లతో కడుతున్న ఆకుపచ్చని గోడ అన్నమాట. విస్తరిస్తున్న సహారా ఎడారిని అడ్డుకోవడానికి చెట్లను పెంచడమే పరిష్కారమని భావించింది ఆఫ్రికన్ యూనియన్. ఎడారి విస్తరించడమేంటీ అంటారా..?**

గత కొన్నేళ్లుగా ఉత్తర ఆఫ్రికా ప్రాంతంలో సాగుభూమి తగ్గిపోతోంది. ఒకప్పటి సారవంతమైన నేల ఇప్పుడు నిస్సారంగా మారింది. అందుకు భూమి నిర్వహణలో లోపాలతో మొదలెట్టి వాతావరణ మార్పుల వరకు ఎన్నో కారణాలు. నేల సారం కోల్పోతే సహజంగానే పంటల దిగుబడి తగ్గి కరవు పరిస్థితులకు దారితీస్తుంది. బీడుబారిన నేలలో చెట్టూ చేమలు పెరగవు. ఫలితంగా జీవవైవిధ్యం తగ్గిపోతుంది. అలా ఉత్తర ఆఫ్రికాకు చెందిన దాదాపు తొమ్మిదివేల రకాల మొక్కలు, జంతువులు కనుమరుగైనట్లు అంచనా. ముఖ్యంగా సహారా ఎడారి చుట్టూ ఉండే సాహెల్ ప్రాంతాన్ని ఈ వినాశనం బాగా దెబ్బతీసింది. ఒకప్పుడు పాడి పంటలతో, ప్రకృతి సౌందర్యంతో విలసిల్లిన నేల ఎడారిగా మారి సహారాలో కలిసిపోవడంతో మొత్తంగా ఎడారి విస్తరిస్తున్నట్లయింది. బుర్కినా ఫాసో, చాద్, ఇథియోపియా, మాలి, నైజీరియా, సూడాన్ లాంటి పదకొండు దేశాలు దీని ప్రభావాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే దాదాపు ఇరవయ్యేళ్ల క్రితం 'ద గ్రేట్ గ్రీన్‌వాల్ ప్రాజెక్ట్'కు శ్రీకారం చుట్టింది ఆఫ్రికన్ యూనియన్. ఆఫ్రికా ఖండం మధ్యలో తూర్పున జిబౌటి నుంచి పశ్చిమాన సెనెగల్ వరకు ఈ గ్రేట్ గ్రీన్‌వాల్‌ని తలపెట్టారు. పదిహేను కి.మీ వెడల్పు, ఎనిమిది వేల కిలోమీటర్ల పొడవునా దట్టంగా చెట్లను పెంచి, 2030 కల్లా ప్రాజెక్టు పూర్తిచేయాలన్నది సంకల్పం. దీనివల్ల ప్రధాన లాభాలేంటీ అంటే దాదాపు పాతిక కోట్ల ఎకరాల నేల సారవంతంగా మారుతుంది, అభివృద్ధి చెందిన అడవి 25 కోట్ల టన్నుల కార్బన్‌ను గ్రహించి వాతావరణాన్ని శుభ్రపరుస్తుంది, కోటిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మొదట్లో ఒకే తరహా మొక్కలను ఒక వరసలో నాటాలనుకున్నారు కానీ పలు కారణాల వల్ల అది విజయవంతం కాలేదు. దాంతో భిన్న ఎత్తుల్లో పెరిగే వైవిధ్యభరితమైన మొక్కలను ఎంచుకుని పెంచడం మొదలెట్టారు. నిధుల కొరత, నీరు లేక మొక్కలు ఎండిపోవడం తదితర సమస్యలెన్నో దాటుకుని దాదాపు ఇరవై దేశాల సహకారంతో, పలు సంస్థల ఆర్థిక సాయంతో ముందుకు సాగుతోందీ ప్రాజెక్టు. ఎక్కడికక్కడ సంప్రదాయ నీటి సంరక్షణ పద్ధతుల్లో వాననీటిని ఒడిసిపట్టి మొక్కల పెంపకానికి వాడుతున్నారు. చైనా ఇలాంటి ప్రయత్నాలు చాలా కాలం క్రితమే మొదలుపెట్టగా ఇతర దేశాలూ ఇప్పుడిప్పుడే అందిపుచ్చుకుంటున్నాయి. మనదేశంలోనూ థార్ ఎడారి విస్తరణను నియంత్రించడానికి 2023లో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆరావళి ప్రాజెక్టును ప్రారంభించారు. వాతావరణ మార్పులతో సతమతమవుతున్న ప్రపంచానికి ఇలాంటి పచ్చదనపు ప్రాజెక్టులు ఎంతైనా మేలు చేస్తాయి కదూ!

# 'వాయిదాల' పార్లమెంటు!

**పార్లమెంటు వర్షా కాల సమావేశాల తేదీలు ఖరారైనప్పుడు నీట్ ప్రశ్నపత్రం లీక్ ఉదంతం ఈ స్థాయిలో సభను ముంచెత్తుతుందనీ, వరస గందరగోళ దృశ్యాలతో మొత్తం కార్యకలాపాలే స్తంభించిపోతాయనీ, వాయిదాలతోనే గడిచిపోతుందనీ ఎవరూ ఊహించి వుండరు. నిరవధిక వాయిదా అనంతరం సమావేశాల తీరుతెన్నులెలా ఉన్నాయో చెప్పటం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి వంతు. ఆ శాఖను నిర్వహిస్తున్న కిరణ్ రిజిజు లోక్‌సభ 19 శాతం, రాజ్యసభ 39 శాతం కాలాన్ని వినియోగించుకో గలిగాయని ప్రకటించారు. ఇలా జరగటం కొత్తేమీ కాదు. చట్టసభలు నిర్దేశించుకున్న లక్ష్యానికీ, సాధించిన ఫలితానికీ పొంతన లేకపోవటం మనకు రివాజే. దీనికి భిన్నంగా మన పార్లమెంటు సక్రమంగా పనిచేసిందంటే, సంతృప్తికరంగా చర్చలు సాగాయంటే ఆశ్చర్యపడాలి. యూపీఏ హయాంలో 2010లో పార్లమెంటు శీతాకాల సమావేశాల వ్యవధిలో కేవలం 5 శాతం మాత్రమే పనిచేసింది.**

రాజ్యసభ అయితే కేవలం 2 శాతం! ఆ రికార్డును అధిగమించిన సమావేశాలు ఇంతవరకూ లేకపోవటం జనం అదృష్టం. సమావేశాల కాలానికి ఎప్పుడూ ఏదో సమస్య ఊడిపడటం, అధికార విపక్షాలు పరస్పర కలహాలు తప్పడంలేదు. ఇలా వాయిదాల పరంపరతో ప్రభుత్వ పక్షం కీలకమని భావించిన బిల్లుల్ని మూజువాణి ఓటుతో ఆమోదింపజేసుకోవటం అసలు సమస్య. యూపీఏ హయాంలో లోక్‌సభలో 20 బిల్లులపై కేవలం అయిదంటే అయిదే నిమిషాలు చర్చ జరిగింది. ప్రజల తలరాతల్ని నిర్ణయించే అనేక నిర్ణయాలు ఈ తోవన చట్టాలుగా మారుతున్నాయి. ఇందులో లక్షల కోట్ల విలువైన ఆర్థిక బిల్లులు కూడా ఉంటున్నాయి. ప్రశ్నోత్తర సమయం, జీరో అవర్ వంటివి కొట్టుకుపోతున్నాయి. క్రమశిక్షణాయుత ప్రవర్తనతో ప్రజల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని పెంచాల్సినవారే అందుకు విరుద్ధమైన సందేశం పంపుతున్నారు. విపక్షంలో ఉండగా బీజేపీ ఏం చేసిందో, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అలాగే చేయాలనుకుంది. ఈ క్రమంలో కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అవుతున్నది.

సమావేశాల ఆరంభం రోజున కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిర్వహించిన 'ఛలో పార్లమెంటు' ఊహించని పరిణామాలకు దారితీసింది. అసలు సమావేశాల్లో సగభాగం దాని చుట్టూనే తిరిగింది. ఆవిర్భవించిన కొన్ని నెలలకే సీజేపీ ఒక అసాధారణ పరిణామానికి కారణం కావటం దాని ప్రత్యేకత. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవినుంచి తప్పుకోవాల్సివచ్చింది. బీజేపీ అధికారంలోకొచ్చిన ఈ పన్నెండేళ్లలోనూ విపక్షాలన్నీ కట్టగట్టుకుని ఒక్కటైనా ఇలా కేంద్రంపై ఒత్తిడి తేలేకపోయాయి. టీఎంసీ ఎంపీలు కొందరు బీజేపీలోకి ఫిరాయించటం, ఇండియా కూటమి నుంచి డీఎంకే వైదొలగటం విపక్షాలను నైతికంగా దెబ్బతీసే పరిణామాలు. రంగంలో సీజేపీ లేనట్టయితే విపక్షాలు నిస్తేజంగా, నిస్సహాయంగా దిక్కుతోచని స్థితిలో పడివుండేవి. తమ ఉద్యమా నికి ప్రధాన విపక్షంగా కాంగ్రెస్ తోడ్పాటు అందించకపోయినా జెన్ జీ ఆ పార్టీకి చేసిన ఉపకారమిది. సమావేశాల రెండో భాగంలో కాంగ్రెస్ కాస్త మేల్కొని ప్రధాని నివాసం ఎదుట ధర్నాకు దిగింది. జెన్ జీ ప్రస్తావించని పెల్లెట్ల అంశాన్ని ప్రధాన సమస్యగా మార్చింది. కోల్పోయిన ప్రతిష్ఠను కొద్దో గొప్పో కాపాడుకునే ప్రయత్నం చేసింది.

రోడ్లపైకొచ్చి ఆందోళన చేస్తే తప్ప చట్టసభలకు తమ సమస్యలు పట్టబోవన్న అభిప్రాయం జనంలో కలగటం మంచి పరిణామమేనా అన్నది పార్టీలు ఆలోచించుకోవాలి. అది శాంతియుత ఆందోళనా, హింసాత్మకమా అన్న విచక్షణలేకుండా ప్రతి సమస్యనూ పోలీసులే పరిష్కరిస్తారన్న అభిప్రాయంతో ఉంటే ఏమవుతుందో జంతర్ మంతర్ నిరూపించింది. సమస్యల్ని చూసే కోణంలోనూ పార్టీల ద్వంద్వప్రవృత్తి వెల్లడవుతోంది. ఢిల్లీలో జెన్ జీ ఉద్యమంపై మొదట్లో అభాండాలేసిన బీజేపీ, సంఘ్ పరివార్ సంస్థలు తమ తప్పిదాన్ని గుర్తించాయి. జార్ఖండ్ ఆందోళనలో చురుగ్గా పాల్గొంటున్నాయి. మంచిదే. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన డీఎస్సీ అవకతవకలపై మాత్రం ఈ సంస్థలు నోరెత్తవు. సాక్షాత్తూ అభ్యర్థులే గోడు వినిపిస్తున్నా బుకాయింపులే. ఇలాంటి వైఖరులే పార్టీల నిజాయితీని ప్రశ్నార్థకం చేస్తాయి. మొత్తానికి వర్షాకాల సమావేశాల తీరుతెన్నులపై అన్ని పక్షాలూ ఆత్మవిమర్శ చేసుకోవాలి. భవిష్యత్తులో ఈ పరిస్థితి తలెత్తకుండా ఏం చేయవచ్చునో ఆలోచించుకోవాలి.

# శెట్టూరులో హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యానికి బలైన విద్యార్థి!

- శిథిల గోడ కూలి హర్షవర్ధన్ తేజ మృతి.. మరో విద్యార్థికి తీవ్ర గాయాలు .
- ప్రహరీ లేకపోయినా పట్టించుకోరా..
- డే వాచ్‌మెన్ విధుల్లో లేకపోవడంపై తీవ్ర ఆరోపణలు
- విద్యార్థుల భద్రతను గాలికొదిలేశారా..

**శెట్టూరు:-ఆగస్టు23. అనంత జనశక్తి న్యూస్**

హాస్టల్ పరిసరాల్లో ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనం కనిపిస్తున్నా అధికారులు, సిబ్బంది ఎందుకు పట్టించుకోలేదన్న ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని హాస్టల్ విద్యార్థులు బహిర్భూమి కోసం సమీపంలోని పాడుబడిన భవనం వద్దకు వెళ్లిన సమయంలో శిథిల గోడ ఒక్కసారిగా కూలడంతో హర్షవర్ధన్ తేజ అనే విద్యార్థి మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. మరో విద్యార్థి అక్షయకు కాలు విరిగినట్లు సమాచారం.

**---ముందస్తు జాగ్రత్తలు ఏవీ..?**

హాస్టల్‌కు ప్రహరీ గోడ లేకపోవడం, సమీపంలో శిథిలావస్థలో ఉన్న భవనం ఉండటం అధికారులకు తెలియని విషయం కాదని స్థానికులు అంటున్నారు. అయినప్పటికీ విద్యార్థులు ఆ ప్రాంతానికి వెళ్లకుండా అడ్డుకునే చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాన్ని రక్షణ కంచెతో మూసివేయడం, విద్యార్థుల కదలికలను పర్యవేక్షించడం వంటి కనీస భద్రతా చర్యలు కూడా చేపట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డే వాచ్‌మెన్ విధుల్లో లేకపోవడంపై ఆరోపణలు

ప్రమాదం జరిగిన సమయంలో డే వాచ్‌మెన్ ముత్యాలు విధుల్లో లేకపోవడం వల్లే విద్యార్థుల కదలికలను పర్యవేక్షించే వారు లేకుండా పోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల భద్రత కోసం నియమించిన సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా హాజరు పట్టికలో ఏముంది విధుల్లో నిర్లక్ష్యం జరిగిందా అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

**--ఒక ప్రాణం పోయాక మేల్కొంటారా..?**

హాస్టల్‌లో చదువుకునే విద్యార్థుల భద్రతకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉండగా, ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నా పట్టించుకోకపోవడం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. శిథిల గోడ కూలే వరకు అధికారులు ఎందుకు స్పందించలేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఒక విద్యార్థి ప్రాణం పోయిన తర్వాతే భద్రతా చర్యలు గుర్తుకు రావడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు.బాధ్యులపై చర్యలు తీసుకోవాలి





ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి హాస్టల్ నిర్వహణలో ఎక్కడ నిర్లక్ష్యం జరిగింది, విధుల్లో ఎవరు గైర్హాజరయ్యారు, ప్రమాదకర భవనంపై ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదనే అంశాలను తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి పాల్పడినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే వెంటనే ప్రహరీ నిర్మించి, హాస్టల్ పరిసరాల్లోని శిథిల నిర్మాణాలను తొలగించి విద్యార్థులకు భద్రమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# అభినవ రాబిన్ హుడ్ వంగవీటి రంగా





- మంత్రి కందుల దుర్గేష్
- కానూరు అగ్రహారంలో శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి రంగా విగ్రహాల ఆవిష్కరణలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు
- శాంతి కపోతాలు ఎగురవేసి, వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు పంపిణీ

**నిడదవోలు ఆగస్టు 23, అనంత జనశక్తి న్యూస్**

నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు అగ్రహారంలో శ్రీ కృష్ణదేవరాయ కాపు ఐక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు, పేదల బాంధవుడు వంగవీటి మోహన రంగాల విగ్రహావిష్కరణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ముఖ్య అతిథులుగా హాజరై, విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం శాంతికి ప్రతీకగా శాంతి కపోతాలను గాల్లోకి ఎగురవేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు.గ్రామానికి విచ్చేసే ప్రజలు, ప్రయాణికులు సేదతీరేలా అద్భుతమైన మండపం ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా గ్రామ నిర్వాహకులు 'కానూరు అగ్రహారం' పేరును నిజమైన అర్థంలో సార్థకం చేసుకున్నారని మంత్రి అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..." సాహితి సమరాంగణ సార్వభౌముడిగా, 'దేశభాష లందు తెలుగు లెస్స' అని చాటిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఇక్కడ నెలకొల్పడం అభినందనీయం. ఆనాటి కాలంలోనే సాంకేతికత లేకపోయినా ప్రతి ఇంటికీ తాగునీరు అందించిన గొప్ప విజన్ ఆయనది. నేడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు శరవేగంగా మంచి నీరు అందిస్తున్నాం." అన్నారు. అదే విధంగా "కులమతాలకు అతీతంగా పేదవాడికి కష్టం వస్తే 'నేను ఉన్నాను' అని నిలబడిన అభినవ రాబిన్ హుడ్ వంగవీటి మోహన రంగా. ఆయన భౌతికంగా దూరమై దశాబ్దాలు గడిచినా, నేటి యువత 'రంగా అమర్ రహే' అని స్మరించుకుంటున్నారంటే ఆయన ప్రజాదరణ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. రంగా ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తాను."అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

**కానూరు అగ్రహార అభివృద్ధికి రూ. 4.40 కోట్లు:**

"రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వ హయాంలో రూ. 4.40 కోట్లతో కానూరు అగ్రహారాన్ని సమగ్రంగా అభివృద్ధి చేశాం. జల్ జీవన్ మిషన్ కింద రూ. 73 లక్షల నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పనులకు ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు.రాబోయే సెప్టెంబర్ నాటికి గ్రామంలో నూతన రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. అలాగే హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు, ఇప్పటికే పూర్తి చేసిన దళిత కమ్యూనిటీ హాల్ తరహాలోనే ఇతర సామాజిక వర్గాలకు కూడా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతాం." అని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో పనిచేయడం గర్వంగా ఉందన్న మంత్రి దుర్గేష్ ... డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో తనను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆదరించిన నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం ప్రజాసేవకుడిగా రుణపడి ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ప్రియ సౌజన్య, పెరవలి మండల టీడీపీ అధ్యక్షులు అతికారి శ్రీను, జనసేన అధ్యక్షులు పిప్పర రవి, జెడ్పీటీసీ రామాంజనేయులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు మరియు వంగవీటి రంగా అభిమానులు, గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# చక్కెర ధరలు ఎందుకు పెరుగుతున్నాయి?

- ఇథనాల్‌కు సంబంధం లేదన్న కేంద్రం
- డా. ముచ్చుకోట సురేష్ బాబు

నెల రోజుల్లో కిలో చక్కెర ధర ₹48.18 నుంచి ₹55.70కు పెరుగుదల — తగ్గిన దేశీయ ఉత్పత్తి, పండుగల డిమాండ్, పంట నష్టం, అంతర్జాతీయ సరఫరా కొరత, నిల్వలు పెంచడం ప్రధాన కారణాలని కేంద్రం వెల్లడిదేశంలో చక్కెర ధరలు ఒక్కసారిగా పెరగడం వినియోగదారుల్లో ఆందోళనకు కారణమవుతోంది. నెల రోజుల వ్యవధిలో కిలో చక్కెర ధర ₹48.18 నుంచి ₹55.70కు చేరింది. కొన్ని ప్రాంతాల్లో ధరలు మరింత పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ ధరల పెరుగుదలకు చక్కెరను ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించడమే కారణమన్న వాదనను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది.ఇథనాల్ ఉత్పత్తికి మళ్లిస్తున్న చక్కెర పరిమాణం వాస్తవానికి తగ్గిందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 2022-23 సీజన్‌లో చక్కెరలో ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించిన వాటా సుమారు 12 శాతం ఉండగా, 2025-26 సీజన్‌లో అది దాదాపు 9 శాతానికి తగ్గిందని తెలిపింది. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడు వంతులు ప్రస్తుతం ధాన్యాల నుంచే, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి వస్తోందని పేర్కొంది.




### తగ్గిన దేశీయ చక్కెర ఉత్పత్తి

ప్రస్తుత సీజన్‌లో దేశీయ చక్కెర ఉత్పత్తి సుమారు 3.06 కోట్ల టన్నులకు పరిమితం కావచ్చని కేంద్రం అంచనా వేసింది. చెరకు సాగు రాష్ట్రాలు తొలుత అంచనా వేసిన 3.43 కోట్ల టన్నులతో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదల.ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రధాన చెరకు ఉత్పత్తి రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు పంట దిగుబడిపై ప్రభావం చూపాయి. అధిక వర్షాలు, నీటిముంపు, తెగుళ్లు, వ్యాధులు చెరకు పంటను దెబ్బతీశాయి. ముఖ్యంగా రెడ్ రాట్, టాప్ బోరర్ వంటి వ్యాధులు దిగుబడిని తగ్గించాయని కేంద్రం వెల్లడించింది.పండుగల నేపథ్యంలో పెరిగిన డిమాండ్ఆగస్టు నుంచి నవంబర్ వరకు దేశంలో పండుగల సీజన్ కొనసాగుతుంది. ఈ కాలంలో మిఠాయిలు, బేకరీ ఉత్పత్తులు, ఇతర ఆహార పదార్థాల తయారీలో చక్కెర వినియోగం సాధారణంగా పెరుగుతుంది.పండుగల డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసిన వ్యాపారులు, వాణిజ్య సంస్థలు పెద్ద మొత్తంలో చక్కెరను కొనుగోలు చేసి నిల్వ చేసుకోవడంతో మార్కెట్ లో తక్షణ డిమాండ్ మరింత పెరిగిందని అధికారులు చెబుతున్నారు.అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సరఫరా ఒత్తిడి దేశీయ పరిస్థితులతో పాటు అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు కూడా చక్కెర ధరలపై ప్రభావం చూపుతున్నాయి. 2026-27లో ప్రపంచ చక్కెర మార్కెట్ లో సుమారు 33 లక్షల టన్నుల లోటు ఏర్పడే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేసింది.అంతర్జాతీయ చక్కెర ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. జూన్ 30న టన్నుకు సుమారు $474గా ఉన్న ధర ఆగస్టు 20 నాటికి $552కు చేరింది. అంటే దాదాపు 16 శాతానికి పైగా పెరుగుదల నమోదైంది. ప్రపంచ వ్యాప్తంగా సరఫరా పరిస్థితులు కఠినతరం కావడం కూడా దేశీయ మార్కెట్ పై ఒత్తిడి పెంచుతోంది.

### నిల్వలు, ఊహాగానాల ప్రభావం

**ధరలు మరింత పెరగవచ్చన్న అంచనాలతో కొంతమంది వ్యాపారులు, డీలర్లు పరిమితికి మించి చక్కెరను నిల్వ చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. దీనివల్ల కృత్రిమ కొరత ఏర్పడి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.పండుగల డిమాండ్, ఉత్పత్తి తగ్గుదల నేపథ్యంలో భవిష్యత్‌లో సరఫరా తగ్గవచ్చన్న అంచనాలతో మార్కెట్‌లో ఊహాగానాలు పెరగడం కూడా ధరలపై ప్రభావం చూపుతున్నట్లు కేంద్రం పేర్కొంది.ధరల నియంత్రణకు కేంద్రం చర్యలు చక్కెర ధరలను అదుపులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మార్కెట్‌లో సరఫరాను పెంచేందుకు 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. అదే సమయంలో వ్యాపారులు, డీలర్లు కలిగి ఉండే చక్కెర నిల్వలపై కఠిన పరిమితులను అమలు చేస్తోంది. దీంతో మార్కెట్‌లో కృత్రిమ కొరతను అరికట్టి, వినియోగదారులకు సరఫరా సజావుగా ఉండేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇథనాల్ కారణం కాదన్న కేంద్రం**

**చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడమే ప్రధాన కారణమన్న విమర్శలను కేంద్రం స్పష్టంగా ఖండించింది. చక్కెరను ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించే వాటా గతంతో పోలిస్తే తగ్గిందని, ప్రస్తుతం ధాన్యాల ఆధారిత ఇథనాల్ ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని తెలిపింది. అందువల్ల ప్రస్తుత ధరల పెరుగుదలను ఇథనాల్ విధానంతో నేరుగా ముడిపెట్టడం సరైనది కాదని కేంద్రం స్పష్టం చేసింది.**

### ఐదు ప్రధాన కారణాలు

**ప్రస్తుతం చక్కెర ధరలు పెరగడానికి ప్రధానంగా ఐదు అంశాలు కారణమని కేంద్రం వివరణను బట్టి తెలుస్తోంది: దేశీయ చక్కెర ఉత్పత్తి తగ్గడం, పండుగల సీజన్‌లో డిమాండ్ పెరగడం. అధిక వర్షా లు, నీటిముంపు, తెగుళ్ల కారణంగా చెరకు పంట దెబ్బతినడం, ప్రపంచ మార్కెట్‌లో చక్కెర సరఫరా తగ్గడం, వ్యాపారుల నిల్వలు, ఊహాగానాల కారణంగా కృత్రిమ కొరత ఏర్పడే అవకాశంచక్కెర ధరల పెరుగుదల వినియోగదారులపై అదనపు భారాన్ని మోపుతున్న నేపథ్యంలో, ఉత్పత్తి-సరఫరా పరిస్థితులను కేంద్రం నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పండుగల సీజన్‌లో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, మార్కెట్‌లో తగినంత నిల్వలు అందుబాటులో ఉండేలా చూడటం కీలకం. ప్రస్తుత ధరల పెరుగుదల వెనుక ఇథనాల్ కంటే ఉత్పత్తి తగ్గుదల, పంట నష్టం, పండుగల డిమాండ్, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, నిల్వలు మరియు ఊహాగానాల ప్రభావమే ప్రధానమని కేంద్రం స్పష్టం చేసింది.**

---

స్పెషల్ క్యాంపెయిన్ డే, హియరింగ్, క్లెయిమ్స్

# పరిష్కారం వేగవంతం చేయాలి



- జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**పుట్టపర్తి,ఆగస్టు, 23:అనంత జనశక్తి న్యూస్**

ఓటర్ల నమోదు, సవరణలకు సంబంధించిన ప్రక్రియలను నిర్ణీత గడువులోగా, పూర్తి పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ బంగ్లా నుండి ఇఆర్వో, ఏఇఆర్వో లతో జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్వో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక ప్రచార దినోత్సవం ఎస్.ఐ.ఆర్ క్లెయిమ్స్ డెలివరీ, మరియు హియరింగ్ ప్రక్రియల పురోగతిపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష జరిపారు.ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఓటర్ల నమోదు, అభ్యంతరాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి.హియరింగ్ నోటీసులు అందిన ప్రతి ఒక్క ఓటరు నిర్దేశిత తేదీన తప్పనిసరిగా హాజరయ్యేలా ఇఆర్వోలు, ఏఇఆర్వోలు ప్రత్యేక దృష్టి సారించాలి.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య , నియోజకవర్గాల ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో 'ఛత్రోంకీ గూంజ్' పెట్టాలి



(మొదటి పేజీ తరువాయి)

ఫీజు రీయింబర్స్‌మెంట్, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై ఈ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.12 వేల కోట్లు ఉన్నాయని చెప్పారు. సిబ్బందికి విద్యాసంస్థలు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తమ నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదన్నారు. పోలీసుల అనుమతి లేకున్నా.. పార్టీ కార్యాలయంలోనే తమ దీక్ష చేపడతామని ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత రూ.4 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని చెప్పారు. హైకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ఈ అంశంలో ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. తెలంగాణలో ప్రభుత్వాన్ని హైకోర్టు నడిపిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అవినీతికి మారుపేరని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబం.. రాష్ట్రాన్ని దోచుకుందనే అభియోగం ఉండేదని.. ప్రస్తుతం రేవంత్ రెడ్డి సోదరుల మీద అలాంటి ఆరోపణలు వస్తున్నాయన్నారు. గతంలో మంత్రి కొండా సురేఖ ఓఎస్‌డీ ఓ కంపెనీ వ్యక్తిపై తుపాకీ గురి పెట్టి బెదిరించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు వసూలు చేస్తుందని తెలంగాణ బీజేపీ చీఫ్ విమర్శించారు.

**ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు బీజేపీ చేయదు: టీ బీజేపీ చీఫ్**

22ఏ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో అంతర్గత అసమ్మతి పెరిగిందని అభిప్రాయపడ్డారు. ఏ ప్రభుత్వం అయినా ఐదేళ్లు పూర్తి చేయాలని కోరుకుంటున్నామని చెప్పారు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఐదేళ్లు అధికారంలో ఉండే అవకాశం లేదని జోస్యం చెప్పారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు తమ పార్టీ చేయదని కుండ బద్దలు కొట్టారు.

**మోదీ జన్మదినం సందర్భంగా..**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని టీ బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు వెల్లడించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు మోదీ @25 సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా బ్లడ్ డొనేషన్, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే కేంద్ర పథకాల లబ్ధిదారులను నేరుగా కలవాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించిందని అన్నారు.

# పోలీస్ వాహనానికి బ్రేకులు ఫెయిల్.!

- కొండకరకాం ఘాట్‌లో అదుపుతప్పిన వాహనం
- చెట్టును ఢీకొట్టడంతో ప్రమాదం

**విజయనగరం, ఆగస్ట్ 23, అనంతజనశక్తి న్యూస్**



పోలీస్ వాహనం బోల్తా పడి, ఓ కానిస్టేబుల్ చనిపోయిన ఘటన విజయనగరం జిల్లాలో చోటుచేసుకుంది. విజయనగరం జిల్లాలోని కొండకరకాం సమీపంలో ఈ ఘటన జరిగింది. విజయనగరం గ్రామీణ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసులు ఓ కేసు దర్యాప్తు కోసం పోలీస్ జీపులో కొండకరకాం బయల్దేరారు. ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి కొండకరకాం వెళ్తున్న సమయంలో ఘాట్ వద్ద ప్రమాదం జరిగింది. బ్రేకులు ఫెయిల్ కావటంతో పోలీసులు వెళ్తున్న జీపు.. అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ చనిపోగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఎస్ఐ అశోక్‌కుమార్, కానిస్టేబుళ్లు వెంకటరమణ, నాగేంద్ర, డ్రైవర్ రాజాబాబు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్ర గాయాలతో కానిస్టేబుల్ వెంకటరమణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీస్ సిబ్బందిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఉన్నతాధికారులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. మరోవైపు హోం మంత్రి వంగలపూడి అనిత ప్రమాద ఘటనపై ఆరా తీశారు. విజయనగరం జిల్లా ఎస్పీ దామోదర్‌కు ఫోన్ చేసిన హోం మంత్రి అనిత.. ఘటన గురించి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను హోం మంత్రి అనిత ఆదేశించారు.

**మద్యం మత్తులో ఆస్పత్రిలో యువకుడి వీరంగం**

మద్యం మత్తులో ఆస్పత్రిలో ఓ యువకుడు హల్చల్ చేశాడు. పాలకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం సమయంలో ఓ యువకుడు చేతికి గాయంతో మద్యం మత్తులో ఆస్పత్రికి వచ్చాడు. ఆస్పత్రిలో హల్చల్ చేశాడు. వైద్య సిబ్బంది భయపడుతూనే అతనికి చికిత్స చేశారు. పాలకొండకు చెందిన కిశోర్ అనే యువకుడు మద్యం మత్తులో చేయి కోసుకున్నాడు. స్థానికులు ఆస్పత్రికి తీసుకురాగా.. ఆస్పత్రిలో గందరగోళం సృష్టించాడు. అద్దాలు పగులగొట్టి సిబ్బందిపై అరుస్తూ.. నానా హంగామా చేశాడు.అడ్డుకునేందుకు యత్నించిన సిబ్బందిపై దాడికి ప్రయత్నం చేశాడు. ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు అక్కడకు చేరుకుని యువకుణ్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతనికి నచ్చజెప్పి చికిత్స చేయించారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్ తీసుకెళ్లారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
సోమవారం | రంగారెడ్డి
24.08.2026


# రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ బాల్ కు బాలికలు ఎంపిక.



**-శ్రీ సత్య సాయి జిల్లా జట్లకు ధర్మవరం బాల బాలికలు స్థానం .**
**-జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ అసోసియేట్ కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి.**

**ధర్మవరం ఆగస్టు 23, అనంత జనశక్తి న్యూస్:**

రాష్ట్ర స్థాయిలో ఆగస్టు 24వ తేదీ తేదీ తేదీ నుండి 27 తేదీ వరకు తిరుపతి నగరంలో జరిగే అమరావతి 2026 బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే శ్రీ సత్య సాయి జిల్లా బాస్కెట్బాల్ బాల బాలికల జట్ల నందు బాలుర విభాగంలో ధర్మవరం పట్టణానికి చెందిన లక్ష్మీ నరసింహ,ఎం కార్తీక్ నాయక్, గౌతమ్, కుమార్, ఆసిఫ్, అశోక్, షేక్, సైఫ్, బాలికల విభాగంలో యశస్విని, అలేఖ్య, వైష్ణవి, మన్విత, ప్రియదీప్తి, ధర్మవరం పట్టణానికి చెందిన 12 మంది మంది బాస్కెట్బాల్ క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపిక కావడం గర్వ కారణమని జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రా రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఆగస్టు 5 తేదీ నెల నందు ధర్మవరం పట్టణంలో జరిగిన సెలక్షన్స్ నందు వీరు ప్రతిభా చూపి జిల్లా జట్లకు ఎంపికయ్యారు అని తెలిపారు.. వీరి ఎంపిక పట్ల , ధర్మాంబా బాస్కెట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామి రెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ తుల్లా, హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో స్థాయిలో వీరు రాణించి ధర్మవరం పట్టణమునకు పేరు ప్రతిష్టలు తేవాలని వారు ఆకాంక్షించారు..ఎంపికైన క్రీడాకారులు ఆదివారం రోజున బయలుదేరి తిరుపతికి వెళ్లారు అని తెలిపారు.

# శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్



**పుట్టపర్తి ఆగస్టు 23:అనంత జనశక్తి న్యూస్**

ఆదివారం ఉదయం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... టంగుటూరి ప్రకాశం పంతులు అసమానమైన గుండె ధైర్యం కలిగిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని కొనియాడారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడి, ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని గుర్తుచేసుకున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు, ధైర్యసాహసాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ సేవలో, ప్రజా సేవలో ప్రతి ఒక్కరూ ముందుకూ సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ సువర్ణ, పుట్టపర్తి తహసీల్దార్ సంహిత పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు రేవెన్యు భవన్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**- అర్జీలను "meekosam.ap.gov.in" వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చు**
**- అర్జీల పరిష్కార సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు**
**- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్**

**పుట్టపర్తి,ఆగస్టు 23:అనంత జనశక్తి న్యూస్**



శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో గల రెవెన్యూ భవన్ (ఎస్.ఆర్. శంకరన్ హాల్) లో రేపు జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుంది.ప్రజలు ఈ మార్పును గమనించి సంబంధిత వేదికకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ నెల 24న సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా రేవెన్యు భవన్కు వచ్చే అవసరం లేకుండా "meekosam.ap.gov.in" లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. రేవెన్యు భవన్లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# విద్యార్థి వైద్య ఖర్చులకు నారాయణ విద్యాసంస్థల ఆపన్న హస్తం

**- జపనీస్ ఎంసెఫలైటిస్ వ్యాధితో బాధపడుతున్న ఇంటర్ విద్యార్థి దావూద్ ఖాన్**
**- జిఎం వేమిరెడ్డి చేతుల మీదుగా రూ.3,28,900లు ఆర్థిక చేయూత**
**- విద్యార్థి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వి.బి.ఆర్**

**నెల్లూరు ఆగస్ట్ 23,అనంత జనశక్తి న్యూస్**



నగరంలోని స్థానిక 42వ డివిజన్ కి చెందిన పి.సందానీ భాష కుమారుడు దావూద్ ఖాన్ అరవింద నగర్ నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన దావూద్ ఖాన్ ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్రాణాంతకమైన జపనీస్ ఎంసఫలైటిస్ అనే తీవ్రమైన వ్యాధి సోకిందని నిర్ధారించారు. వైద్యానికి 50 లక్షల మేర ఖర్చవుతుందని తెలిపారు. నిరుపేదలైన తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని గమనించిన నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థి వైద్య ఖర్చులకోసం నగదు సేకరించి ఆర్థిక చేయూతనందించేందుకు ముందుకొచ్చింది. ఆదివారం సమకూర్చిన రూ 3,28,900లు నగదును విజయ భాస్కర్ రెడ్డి విద్యార్థి తండ్రి సంధాని భాషకు అందజేసి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ పరంగా విద్యార్థికి సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జిఎం విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ నారాయణలో ఇంటర్ చదువుతున్న తమ విద్యార్థి దావూద్ ఖాన్ అనారోగ్యానికి గురవడం బాధాకరమన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థి త్వరగా కోలుకుని మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వేమి రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థికి అండగా నిలిచిన నారాయణ సిబ్బందికి విద్యార్థులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోర్ డీన్లు జయకుమార్ రాయుడు, కె ఎస్ ఆర్, డీన్ సుధాకర్ రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ రాజగోపాల్, సిబ్బంది విద్యార్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వేమారెడ్డి పల్లిలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణోత్సవం

**- వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**
**- దేవాలయ అభివృద్ధికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

**ఓడిచెరువు, ఆగస్టు 23,అనంత జనశక్తి న్యూస్**



వేమారెడ్డి పల్లిలో శ్రీ సీతారామ కళ్యాణోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు, శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో మాజీ మంత్రి, టీడీపీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వేమారెడ్డి పల్లికి చేరుకోగానే గ్రామస్తులు, భక్తులు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి వేడుకలను తిలకించారు.ఈ సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తరఫున దేవాలయ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పల్లె కుటుంబ సభ్యులు తెలిపారు.శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు తుమ్మల మహబూబ్ బాషా, శివారెడ్డి, బాలు ,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బుద్దల ప్రవీణగోపీనాథ్ రెడ్డి, నిజాం, కంచి సురేష్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పీట్లా సుధాకర్ , మనోహర్ , నాగరాజు ,సోమనాథ్ రెడ్డి ,అంజనప్ప , మాజీ కన్వీనర్ రాజారెడ్డి, జాకీర్, రామాంజనేయులు, గంగాద్రి, చికెన్ షాను , గంటా శ్రీనివాసులు ,రామాంజీ , మలక భాస్కర్ రెడ్డి, గోపీనాథ్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్ , శరత్ కుమార్ రెడ్డి ,హనుమంత రెడ్డి ,రంగారెడ్డి ,
శివారెడ్డి ,చినపరెడ్డి ,రెడ్డప్ప ,వేమారెడ్డి పల్లి గ్రామస్తులు కార్యకర్తలు, ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.అంతకు ముందు కదిరిలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకులు ఎస్ వి టి రాజా రెడ్డి నీ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. మాజీ మంత్రి తోపాటు టీడీపీ నాయకులు కొత్త చెరువు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ప్రేమానాథ్ రెడ్డి ,
ఎస్టీ నాయకులు సోమల నాయక్ ,శ్రీనివాస్ నాయక్ , కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం పంతులు జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

**- ఎస్కేయూలో ఘనంగా ఆంధ్ర కేసరి 154వ జయంతి వేడుకలు**

**అనంతపురం, ఆగస్టు 23:అనంత జనశక్తి న్యూస్**



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలను ఆదివారం ఎస్కేయూ కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దేశభక్తి, ధైర్యం, త్యాగం, ప్రజాసేవా స్ఫూర్తిని వక్తలు స్మరించుకున్నారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్. రామచంద్ర, పరీక్షల నియంత్రణాధికారి శ్రీ శ్రీరామ్ నాయక్, ప్రజా సంబంధాల అధికారి డా. బి. సత్యనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీ ఎం. తిమ్మప్ప, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఆర్. రామచంద్ర మాట్లాడుతూ పేదరికం, కష్టాలను అధిగమించి ప్రకాశం పంతులు ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. న్యాయవాదిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయన అందించిన సేవలను గుర్తుచేశారు.ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు ధైర్యం, పట్టుదల, దేశభక్తి, నిస్వార్థ ప్రజాసేవ నేటి తరానికి ఆదర్శమన్నారు. చిన్ననాట తండ్రిని కోల్పోయినా తల్లి చేసిన త్యాగంతో విద్యను కొనసాగించి ఉన్నత స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. విద్య కోసం ఆర్థిక సహాయం పొందేందుకు ప్రకాశం పంతులు దాదాపు 25 మైళ్లు నడిచి వెళ్లి నిరాశతో తిరిగి వచ్చిన సందర్భాన్ని ఉపకులపతి వివరించారు. అనంతరం మరో 25 మైళ్లు నడిచి ఇంటికి చేరిన ఆయనకు తల్లి తన పట్టు చీరను తాకట్టు పెట్టి విద్య కోసం అవసరమైన డబ్బును సమకూర్చిందన్నారు. విద్యార్థులు కష్టాలను అధిగమిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.1928లో సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో బ్రిటిష్ పోలీసుల తుపాకులకు ఎదురుగా నిలిచి ప్రదర్శించిన నిర్భయత్వం కారణంగానే ప్రకాశం పంతులకు 'ఆంధ్ర కేసరి' అనే బిరుదు లభించిందని ఉపకులపతి తెలిపారు.మహాత్మా గాంధీ సిద్ధాంతాల ప్రభావంతో స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రకాశం పంతులు 1921లో 'స్వరాజ్య' జాతీయవాద పత్రికను స్థాపించి స్వాతంత్ర్య, స్వరాజ్య భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లారని చెప్పారు. ప్రజా పార్టీ స్థాపనతో పాటు ఆంధ్ర ప్రాంత రాజకీయ, సామాజిక అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు.ప్రకాశం పంతులు మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రీమియర్గా, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా సేవలందించారని ఉపకులపతి వివరించారు. విజయవాడలోని కృష్ణానదిపై నిర్మించిన ప్రకాశం బ్యారేజీ ఆయన వారసత్వానికి గుర్తుగా నిలిచిందన్నారు.ప్రకాశం పంతులు జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన 'ఆంధ్ర కేసరి' చిత్రాన్ని 1983లో తాను వీక్షించిన విషయాన్ని ఉపకులపతి గుర్తుచేశారు. విద్యార్థులు చారిత్రక, జీవిత చరిత్ర ఆధారిత చిత్రాలను వీక్షించడంతో పాటు ప్రముఖుల జీవిత చరిత్రలను చదివి వారి నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు."న్యాయవాదిగా, విద్యార్థిగా, ఉపాధ్యాయుడిగా, నాయకుడిగా ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయులు. కష్టాలు, సవాళ్లను ధైర్యం, పట్టుదలతో అధిగమించి ఆయన చూపిన మార్గం తరతరాలకు స్ఫూర్తిదాయకం" అని ఉపకులపతి అన్నారు.కార్యక్రమం ముగింపులో తెలుగు విభాగం అకడమిక్ కన్సల్టెంట్ డా. నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి



**నోటీసుల పంపిణీ, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను తనిఖీ చేసిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి, ఆగస్టు 23,అనంత జనశక్తి న్యూస్**

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన, ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ, సహాయక పత్రాల సేకరణ, ఓటర్ల ప్రత్యేక ప్రచార కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో
పరిశీలించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులు ఓటర్లకు ఏ విధంగా అందుతున్నాయో కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. నోటీసులు అందజేసే సమయంలో ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధార పత్రాలు, నమోదు వివరాలను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు సేకరిస్తున్న రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.

**విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలి**

అధికారుల ద్వారా నోటీసులు అందుకున్న పౌరులు, నోటీసులో పేర్కొన్న గడువు తేదీన సంబంధిత విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎంతమందికి నోటీసులు అందించారు, ఎంతమంది విచారణకు హాజరయ్యారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, సంబంధిత వ్యక్తులు విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**బీఎల్ఓ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు**

శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాల ద్వారా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారు ఫారం-6, ఓటరు జాబితా నుంచి పేరు
తొలగింపునకు ఫారం-7, వివరాల సవరణ లేదా చిరునామా మార్పునకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని బీఎల్ఓలను సంప్రదించి అవసరమైన దరఖాస్తులు సమర్పించి ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు.కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# షుగర్ ఉన్నవారికి డాక్టర్ సిఫార్స్ చేసిన మూడు పరీక్షలు, తప్పక చేయించుకోవాలి లేదంటే మీ కళ్లు, కిడ్నీలకే డ్యామేజ్







## డయాబెటిస్ ఉంటే కనిపించే లక్షణాలు

తరచుగా మూత్రవిసర్జన
విపరీతమైన దాహం
అధిక ఆకలి
అలసట, బలహీనత
అస్పష్టమైన దృష్టి
బరువు తగ్గడం







డయాబెటిస్.. ఇప్పుడు చాలా మందిని ఇబ్బంది పెడుతున్న సమస్య. ఇది చాలా నెమ్మదిగా ప్రారంభమవుతుంది. చాలా మంది తీవ్రమైన సమస్యలు తలెత్తే వరకు తమకు ఈ వ్యాధి ఉందని గ్రహించరు. అయితే, డయాబెటిస్‌ని నిర్లక్ష్యం చేస్తే అది నెమ్మదిగా శరీరాన్ని గుల్ల గుల్ల చేస్తుంది. తెలుసుకునేలోపు జరగాల్సిన డ్యామేజ్ జరిగిపోతుంది. ఇది ఒక జీవనశైలికి సంబంధించిన వ్యాధి. అందుకే సరైన లైఫ్‌స్టైల్ పాటించాలి. ఇక, షుగర్ ఉన్నవారు కొన్ని పరీక్షలు కూడా తప్పకుండా చేయించుకోవాలి. ఈ పరీక్షల ద్వారానే షుగర్ లెవల్స్ అదుపులో ఉన్నాయో లేదో తెలుస్తుంది. ఇక, ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ బ్రిజ్మోహన్ అరోరా మూడు పరీక్షల్ని సిఫార్స్ చేస్తున్నారు. డాక్టర్ బ్రిజ్మోహన్ అరోరాకి 24 సంవత్సరాల అనుభవంతో ఈ పరీక్షల్ని సిఫార్స్ చేస్తున్నారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఆ పరీక్షల్ని సూచించారు. దీర్ఘకాలిక సమస్యల్ని నివారించడానికి, నాణ్యమైన జీవితాన్ని నిర్వహించడానికి ఇది చాలా ముఖ్యం. ఆ మూడు పరీక్షలేంటి, ఎందుకు షుగర్ పేషంట్లు చేయించుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**డయాబెటిస్‌ని ముందస్తుగా గుర్తించడం ఎందుకు ముఖ్యం?**

డయాబెటిస్ చికిత్స ప్రారంభించడానికి కేవలం మూడు రక్త పరీక్షలు సరిపోతాయని డాక్టర్ అరోరా వివరిస్తున్నారు. మీకు డయాబెటిస్ ఉంటే లేదా వచ్చే అవకాశాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించి అవసరమైన మూడు పరీక్షలు చేయించుకోవాలని ఆయన సలహా ఇస్తున్నారు. డయాబెటిస్‌ని సకాలంలో గుర్తించాలి. లేదంటే అది చేయాల్సిన డ్యామేజ్‌ని చేసేస్తుంది. డయాబెటిస్ నిర్ధారణ అయితే చికిత్స సరైన సమయంలోయ అందుతుంది. లేదంటే మీ అంతర్గత అవయవాల్ని ప్రమాదంలో పడేస్తుంది.

**మధుమేహానికి 3 ముఖ్యమైన రక్త పరీక్షలు**

HbA1c: ఇది గత మూడు నెలల్లో రక్తంలో చక్కెర స్థాయిల సగటును నిర్ధారిస్తుంది.

FBS (ఫాస్టింగ్ బ్లడ్ షుగర్): ఇది ఖాళీ కడుపుతో చేయించుకోవాల్సిన షుగర్ పరీక్ష. తినకముందు రక్తంలో షుగర్ లెవల్స్ పరీక్షిస్తారు.


PPBS: ఏదైనా తిన్న రెండు గంటల తర్వాత రక్తంలో షుగర్ స్థాయిల్ని చెక్ చేయడానికి ఈ పరీక్ష నిర్వహిస్తారు.

ఈ మూడు పరీక్షలు ఏ వైద్యుడైనా సరే డయాబెటిస్‌ను నిర్ధారించడానికి.. దాని తీవ్రతను అంచనా వేయడానికి సాయపడతాయి. అంతేకాకుండా డైట్, మెడిసిన్, చికిత్స అందించడానికి సాయపడతాయి.


**డయాబెటిస్ ఆలస్యంగా నిర్ధారణ చేయడం వల్ల కలిగే నష్టాలు**


డయాబెటిస్‌కు చికిత్స ఆలస్యం చేయడం వల్ల తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయని డాక్టర్ అరోరా హెచ్చరిస్తున్నారు. ఆలస్యం ప్రమాదకరం అని నిపుణులు అంటున్నారు. ఆలస్యంగా నిర్ధారణ చేయడం వల్ల నరాలు (డయాబెటిక్ న్యూరోపతి), కళ్ళు (డయాబెటిక్ రెటినోపతి), కిడ్నీలు, గుండె వంటి వాటికి డ్యామేజ్ జరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరిస్తున్నారు. ముందుగానే చికిత్స ప్రారంభించడం వల్ల దీర్ఘకాలిక నష్టం జరిగే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. రోగులు డయాబెటిస్‌ను సమర్థవంతగా నిర్వహించడంలో సాయపడుతుంది.

# వయస్సు మీద పడటాన్ని ఆలస్యం చేసే వ్యాయామాలు, డాక్టర్ ప్రకారం ఏది బెస్ట్ అంటే



సాధారణంగా ఫిట్‌నెస్ అనగానే అందరూ బరువు తగ్గడం గురించి ఆలోచిస్తారు. అయితే మన చర్మం ఆరోగ్యంగా ఉండాలన్నా, వయసు పెరిగినా ముఖంలో ఆ మెరుపు తగ్గకుండా ఉండాలన్నా మనం చేసే వ్యాయామం చాలా కీలకం. వయస్సు పెరిగినా అలా కనిపించకుండా ఉండేందుకు, అలాగే ఆరోగ్యం కోసం కొన్ని వ్యాయామాలు చాలా మంచి ఫలితాలనిస్తాయి. అసలు ఏ వ్యాయామం ఎంతవరకు ఉపయోగపడుతుందో చెబుతూ ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో పోస్ట్ చేశారు. ఏ వ్యాయామానికి ఎంత రేటింగ్ ఇచ్చారో, ఎందుకు ఇచ్చారో ఇప్పుడు చూద్దాం.







**స్ట్రెంత్ ట్రైనింగ్ మంచిది**

కండరాలు పెరిగినప్పుడు అది చర్మం సాగకుండా చూస్తుందని, ఎముకల బలానికి ఇది ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. యాంటీ ఏజింగ్ ప్రయోజనాలు పొందాలనుకునే వారు కచ్చితంగా వెయిట్ లిఫ్టింగ్ లేదా రెసిస్టెన్స్ ట్రైనింగ్ చేయాలని ఆమె సూచించారు. దీని తర్వాత పైలేట్స్, ఫంక్షనల్ ట్రైనింగ్ రెండింటికీ 9 పాయింట్ల చొప్పున రేటింగ్ ఇచ్చారు. ఇవి శరీరాన్ని ఫ్లెక్సిబుల్‌గా ఉంచడమే కాకుండా కోర్ స్ట్రెంత్‌ను పెంచుతాయి.

**నడక, యోగాకు ఎంతంటే?**

ప్రతిరోజూ చేసే వాకింగ్‌కు ఆమె 7 పాయింట్లు ఇచ్చారు. ఇది గుండె ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, కేవలం నడక వల్ల మాత్రమే యాంటీ ఏజింగ్ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో లభించవని స్పష్టం చేశారు. అలాగే మానసిక ప్రశాంతత, శారీరక ప్రయోజనాల కోసం చేసే యోగాకు 8, స్విమ్మింగ్‌కు 8 రేటింగ్ ఇచ్చారు. ఈ రెండూ శరీరంలోని ఒత్తిడిని తగ్గించి హార్మోన్ల సమతుల్యతను కాపాడుతాయని డాక్టర్ అభిప్రాయపడ్డారు.

**దేనికి ఎంత రేటింగ్?**

యానిమల్ ఫ్లో: 8
హై ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ : 6-7
సైక్లింగ్: 6
రన్నింగ్: 4
జుంబా: 4
స్ట్రెచింగ్: 3


**అధిక కార్డియోతో జాగ్రత్త!**

కేవలం కార్డియో చేసే వారికి ఆమె మైనస్ రేటింగ్ ఇచ్చారు. ఎక్కువ సమయం కార్డియో చేయడం వల్ల ముఖంలోని కొవ్వు కరిగిపోయి, చర్మం త్వరగా ముడతలు పడే అవకాశం ఉంటుందని, దీనినే 'రన్నర్స్ ఫేస్' అంటారని ఆమె వివరించారు.

వ్యాయామం అనేది అన్ని రకాల కండరాలకు ప్రయోజనం చేకూరే విధంగా ఉండాలని ముఖ్యంగా యాంటీ ఏజింగ్ కోసం స్ట్రెంత్ ట్రైనింగ్‌ను నిర్లక్ష్యం చేయకూడదని ఆమె స్పష్టంగా చెప్పారు.

**జీవనశైలి కూడా ముఖ్యమే**

ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు సరైన వ్యాయామం ఎంచుకోవడం ద్వారా యవ్వనాన్ని కాపాడుకోవచ్చని డాక్టర్ వివరించారు. మీరు కూడా మీ వయసును బట్టి, శరీర అవసరాలను బట్టి డాక్టర్ సూచించిన ఈ రేటింగ్స్‌ను పరిగణనలోకి తీసుకొని మీ వర్కవుట్ ప్లాన్ సిద్ధం చేసుకోండి.



# 30 వసంతాల ప్రేమదేశం..
# వెండితెరపై మరపురాని కావ్యం

ప్రేమ గొప్పదా, స్నేహం గొప్పదా అనే ప్రశ్న ఎదురైనప్పుడు.. ఆ రెండూ గొప్పవే కానీ, స్నేహం కోసం ప్రేమను సైతం వద్దనుకొనే త్యాగం ఇంకా గొప్పది అని చాటిచెప్పిన సినిమా 'ప్రేమదేశం'. అబ్బాస్, వినీత్, టబుప్రధాన పాత్రల్లో తమిళ దర్శకుడు కదిర్ తెరకెక్కించిన ఈ సినిమా ప్రేమకథా చిత్రాల్లో ఒక క్లాసిక్‌గా నిలిచిపోయింది. ముఖ్యంగా రెహమాన్) సంగీతంలోని మరపురాని పాటలు, కాలేజీ నేపథ్యంలోని సన్నివేశాలు 90ల నాటి యువతను ఉర్రూతలూపాయి. 1996 ఆగస్టు 23న విడుదలైన ఈ సినిమా నేటితో 30 వసంతాలు పూర్తి చేసుకుంటోంది. ఈ సందర్భంగా ఈ సినిమా విశేషాలు మీకోసం.



దర్శకుడు కదిర్ తమిళంలో తెరకెక్కించిన తొలి చిత్రం 'ఇదయం' యువతను విశేషంగా ఆకట్టుకొని కల్ట్ స్టేటస్ పొందింది. ఆ తరువాత 'ఉళవన్' అనే సినిమా తీస్తే, అది ఫర్వాలేదనిపించుకుంది. ఈసారి స్నేహబంధంలోని గొప్పతనాన్ని, ప్రేమలోని గాఢతను మేళవించి ఓ కథను తయారు చేసుకున్నాడు. జెంటిల్‌మేన్, ప్రేమికుడు లాంటి సూపర్‌హిట్లు తీసిన నిర్మాత కుంజుమన్‌కు కథ వినిపించారు. ఆ అద్భుతమైన కథకు ఆయన ఫిదా అయిపోయి, దాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చారు. స్వచ్ఛమైన ప్రేమకథకు ఫ్రెష్ ఫేస్‌లు అయితే బాగుంటుందన్నది కదిర్ ఆలోచన. దానికి అనుగుణంగానే సినిమాలతో ఏమాత్రం సంబంధం లేని అబ్బాస్‌ను, తమిళ ప్రేక్షకులకు పరిచయం లేని టబును ఎంచుకున్నారు. చిన్న చిన్న పాత్రల్లో నటిస్తున్న వినీత్‌ను మరో హీరో పాత్రకు సెలెక్ట్ చేశారు. ఈ ప్రేమకథకు పాటలు ప్రాణవాయువులాంటివని కదిర్‌కు తెలుసు. అందుకే అప్పటికే తన మ్యూజిక్‌తో మ్యాజిక్ చేస్తున్న ఏఆర్ రెహమాన్‌ను సంగీత దర్శకుడిగా ఎంచుకున్నారు. అలా చరిత్రలో నిలిచిపోయిన ప్రేమకథ చిత్రానికి శ్రీకారం జరిగింది.

కథేంటంటే..

కార్తిక్(వినీత్), అరుణ్(అబ్బాస్) వేర్వేరు కళాశాలలకు చెందిన ఫుట్‌బాల్ జట్ల కెప్టెన్లు. వీరిద్దరి మధ్య శత్రుత్వం ఉంటుంది. ఒక ప్రమాదంలో అరుణ్ ప్రాణాలను కార్తీక్ కాపాడటంతో ఇద్దరూ ప్రాణ స్నేహితులుగా మారుతారు. కొన్నాళ్ల తరువాత వీరి జీవితాల్లోకి దివ్య(టబు) ప్రవేశిస్తుంది. కార్తీక్, అరుణ్ ఇద్దరూ దివ్యతో ప్రేమలో పడతారు. తామిద్దరం ప్రేమిస్తున్నది ఒకే అమ్మాయినే అనే విషయం తెలిసినప్పుడు, వారి స్నేహబంధం మళ్లీ ఒడుదొడుకులకు లోనవుతుంది. ఈ విషయం తెలిసిన దివ్య ఏ నిర్ణయం తీసుకుంది అన్నది ఈ చిత్ర కథాంశం.

అబ్బాస్‌కు నటుడిగా ఇదే తొలి చిత్రం. వినీత్ పేరు తెలుగు ప్రేక్షకులకు పెద్దగా తెలియని రోజులవి. అప్పటికి టబు తెలుగులో చేసింది రెండే సినిమాలు. ఇక తమిళ దర్శకుడు కదిర్ గురించి అసలే తెలియదు. అయినప్పటికీ ఓ అనువాద చిత్రంగా తెలుగులో విడుదలై ప్రభంజనం సృష్టించింది. తమిళంలో 'కాదల్‌దేశం' పేరుతో ఈ చిత్రం రూపొందింది.

రెహమాన్ స్వరపరిచిన ప్రతి పాటా ఓ ఆణిముత్యం. మరీ ముఖ్యంగా 'ముస్తఫా ముస్తఫా.. డోంట్ వర్రీ ముస్తఫా.. కాలం నీ నేస్తం ముస్తఫా..' అయితే ఫ్రెండ్షిప్ యాంథమ్‌గా నిలిచిపోయిందని చెప్పొచ్చు. 'హలో డాక్టర్ హార్ట్ మిస్సాయ్యే..', 'కనులు తెరచినా కన్నెపిల్లా.. క క క కాలేజీ స్టైలే..', 'ప్రేమ.. ప్రేమ.. ప్రేమా..' పాటలు కూడా కుర్రాళ్ల గుండెల్లో మార్మోగిపోయాయి. దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఈ చిత్రానికి పాటలు పాడటమే కాదు, హీరోయిన్ తండ్రిగానూ నటించడం విశేషం.

అబ్బాస్ హెయిర్‌స్టైల్ యూత్‌కు తెగ నచ్చేసింది. అమ్మాయిలకు డ్రీమ్‌బాయ్‌గా మారారు. ఈ సినిమాతో వచ్చిన క్రేజ్ ఆయనకు తమిళంతో పాటు తెలుగులోనూ అవకాశాలను తెచ్చిపెట్టింది. వినీత్ కూడా సినిమాలతో బిజీ అయ్యారు. మరోవైపు టబు తెలుగుతో పాటు బాలీవుడ్‌లోనూ ప్రముఖ కథానాయికగా పేరుతెచ్చుకున్నారు.

కెరీర్ ఆరంభంలో చిన్న చిన్న పాత్రల్లో నటిస్తున్న విక్రమ్ ఈ సినిమాలో అబ్బాస్ పాత్రకు డబ్బింగ్ చెప్పారు. తరువాతి రోజుల్లో ఆయన 'సేతు', 'శివపుత్రుడు', 'అపరిచితుడు' లాంటి చిత్రాలతో స్టార్ హీరోగా ఎదిగారు.

ఈ సినిమాకు ఎ.కరుణాకరన్ అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ తరువాత ఆయన పవన్ కల్యాణ్‌తో 'తొలిప్రేమ' లాంటి బ్లాక్‌బస్టర్ లవ్‌స్టోరీని తెరకెక్కించి ఆశ్చర్యపరిచారు. తెలుగులో ప్రేమకథా చిత్రాల దర్శకుడిగా తనదైన ముద్ర వేశారు.

ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన కె.వి.ఆనంద్.. 'రంగం' సినిమాతో దర్శకుడిగా సూపర్‌హిట్ కొట్టారు. ప్రముఖ నటులు సూర్య, ధనుష్‌లతో సినిమాలు తెరకెక్కించారు.

యూట్యూబ్‌లో ఈ చిత్రాన్ని ఉచితంగా వీక్షించొచ్చు. ఇన్నేళ్ల తరువాత చూసినా కూడా, ఇందులోని బలమైన స్నేహం, స్వచ్ఛమైన ప్రేమ, గాఢమైన భావోద్వేగాలు, వీనుల విందైన సంగీతం, ముఖ్యంగా క్లైమాక్స్ కట్టిపడేస్తాయి.

# 'హలో డియర్' మమిత




హలో డియర్..' అంటూ ప్రేక్షకుల్ని పలకరించడానికి సిద్ధమవుతోంది మలయాళ భామ మమితా బైజు. భాషతో సంబంధం లేకుండా ఎదురైన అవకాశాన్ని అందుకుంటూ తక్కువ కాలంలో మంచి క్రేజ్‌ను సంపాదించుకున్న తార ఈమె. ప్రస్తుతం ఇటీవలే విడుదలైన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా విజయాన్ని ఆస్వాదిస్తున్న మమిత నటిస్తున్న కొత్త చిత్రమే 'హలో డియర్'. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫస్ట్‌లుక్‌ను పంచుకుందామె. "ఒక హలో, ఒక గందరగోళం, ఒక ప్రేమకథ.. 'హలో డియర్" అనే వ్యాఖ్యను జోడించింది. ఈ చిత్రానికి డినోయ్ పౌలోస్ దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత్ ప్రతాప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఓ మహానగర నేపథ్యంలో నేటి యువతను ఆకట్టుకునే కథనంతో దీన్ని తీర్చిదిద్దుతున్నారని, ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోందని చిత్ర వర్గాలు తెలిపాయి. ఆషిక్ ఉస్మాన్ నిర్మిస్తున్నారు.

# భర్త చనిపోతే బొట్టు, గాజులు తీసేయాలా?
# అనసూయ సూటి ప్రశ్న



నటి అనసూయ "నా దృష్టిలో చెప్పాలంటే.. ఈ అలంకరణను పరిచయం చేసిన అమ్మమ్మ చనిపోయినప్పుడు కదా వాటిని వదులుకోవాలి. బొట్టు, గాజులు వేసుకోవడం అనేది పూర్తిగా వాళ్ల వ్యక్తిగత ఇష్టం కదా? ఏవైనా పూజలు, శుభకార్యాలు జరిగినప్పుడు కూడా కొన్ని బలవంతపు రూల్స్ నాకింకా కనిపిస్తూనే ఉన్నాయి. అసలు ఇవన్నీ ఎక్కడ రాసి ఉన్నాయి? నేను ఎవరినీ ఉద్దేశించి, ఎవరికీ వ్యతిరేకంగా ఈ మాటలు అనడం లేదు. నాలో మెదిలిన ఒక సందేహాన్ని మాత్రమే మీ అందరితో పంచుకుంటున్నాను" అని అనసూయ తన మనసులోని భావాలను వ్యక్తపరిచారు.సామాజిక మాధ్యమాల వేదికగా భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి మరణానంతరం తన తల్లి జీవితంలో వచ్చిన మార్పులను చూసి తాను మూడేళ్లుగా మథనపడుతున్నట్లు చెప్పారు. భర్త చనిపోతే మహిళలు బొట్టు, గాజులు తీసేయాలనే ఆచారంపై ఆమె పలు ప్రశ్నలు అడిగారు. "మూడేళ్లుగా ఒక ప్రశ్న నన్ను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మా నాన్న మూడేళ్ల క్రితం చనిపోయారు. అప్పటినుంచి మా జీవితాల్లో చాలా మార్పులొచ్చాయి. మా అమ్మ ముస్తాబైతే చాలా అందంగా ఉంటుంది. చక్కగా బొట్టు, కాటుక, రంగురంగుల గాజులు, గజ్జెలు పెట్టుకుంటే చూడముచ్చటగా ఉంటుంది. కానీ, నాన్న చనిపోయాక సమాజంలోని మాటల వల్ల ఆమె వాటన్నింటికీ దూరమైంది. ఆ పరిస్థితులు కష్టంగా అనిపించాయి. ముఖ్యంగా ఆడపిల్లలు నా బాధను అర్థం చేసుకోగలరు. నన్ను వెంటాడుతున్న ప్రశ్న ఒక్కటే. ఆడపిల్లలకు బొట్టు, కాటుక, గాజులు, గోరింటాకు వంటివి పెళ్లికి ముందే వాళ్ల అమ్మ, అమ్మమ్మలు పరిచయం చేస్తారు. అలాంటప్పుడు వీటికి భర్త జీవితంతో ఎందుకు ముడిపెడుతున్నారు?"

# బాడీ లైన్.. నెగెటివ్ బౌలింగ్.. నోరు జారుడు...
# తొలిరోజే డిఫెన్స్‌లోకి లంకేయులు

సొంతగడ్డపై భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో (SL vs IND) శ్రీలంక వ్యూహం మార్చింది. తొలి టెస్టులో ఓడిన లంకేయులు ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను 1-1తో సమం చేయాలనే లక్ష్యంతో కొత్త ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఆ జట్టు బౌలర్లు బౌలింగ్‌లో మార్పులు చేసుకోవడంతోపాటు భారత ఆటగాళ్లతో కాస్త కయ్యానికి కాలు దువ్వుతున్నారు. మనోళ్లు కూడా తగ్గేదేలే అంటూ దీటుగా బదులిస్తున్నారు. దీంతో తొలిరోజే ఆట హాట్ హాట్‌గా సాగింది.

గాలెలో జరిగిన తొలి టెస్టులో విజయం సాధించి జోరు మీదున్న టీమ్ఇండియా (Team India) రెండో టెస్టులోనూ శుభారంభం చేసింది. దీంతో ఆతిథ్య జట్టు నయా ప్లాన్‌తో భారత బ్యాటర్ల సహనానికి, శరీరానికి పరీక్ష పెడుతోంది. తొలి రోజు ఆటలో శ్రీలంక ఫాస్ట్ బౌలర్లు భారత బ్యాటర్ల శరీరాన్ని లక్ష్యంగా చేసుకుని ఎక్కువగా షార్ట్ పిచ్ బంతులు సంధించారు. లంక పేసర్ల బాడీ లైన్ బౌలింగ్‌తో టీమ్ఇండియా బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా లాహిరు కుమార షార్ట్ పిచ్ బంతులతో దేవదత్ పడిక్కల్, రవీంద్ర జడేజాలను పరీక్షించాడు. ఓ బాల్ జడేజా ఎడమ చేతి ముంజేయికి బలంగా తాకింది.




ఫిజియో వచ్చి చికిత్స చేయడంతో బ్యాటింగ్ కొనసాగించాడు. అంతకుముందు లాహిరు వేసిన షార్ట్ పిచ్ బంతికి రిషభ్ పంత్ (3) గాయపడి రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. వేగంగా వచ్చిన బంతి పంత్ ఎడమ చేతి మణికట్టుకు బలంగా తాకింది. ఫిజియో వచ్చి చికిత్స చేసినా నొప్పి తగ్గకపోవడంతో మైదానాన్ని వీడాల్సి వచ్చింది.

మాటల యుద్ధం

తొలి రోజు ఆటలో బాడీ లైన్ బౌలింగ్‌తోనే కాకుండా ఆటగాళ్ల మధ్య మాటల యుద్ధం కూడా నడిచింది. మ్యాచ్ ఆరంభంలో యశస్వి జైస్వాల్ లంక బౌలర్లపై విరుచుకుపడుతూ వేగంగా పరుగులు సాధించాడు. ముఖ్యంగా అసిత ఫెర్నాండో వేసిన ఒకే ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదాడు. ఆ తర్వాత ఫెర్నాండో ఒక అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను 45 పరుగుల వద్ద క్లీన్‌బౌల్డ్ చేశాడు. వికెట్ తీసిన ఆనందంలో ఫెర్నాండో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ జైస్వాల్ వైపు వెళ్తూ దూకుడుగా సెలబ్రేషన్స్ చేసుకుంటూ ఏదో అన్నాడు.

అందుకే పెవిలియన్‌కి కామ్‌గా వెళ్లిపోతున్న జైస్వాల్ వెనక్కి వచ్చి.. వాగ్వాదానికి దిగాడు. ఒకరికొకరు ఎదురెదురుగా వచ్చి మాటల యుద్ధానికి దిగారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. మధ్యలో ఎవరిదో చెయ్యి జైస్వాల్‌ను కాస్త వెనక్కి నెట్టింది. అప్పటికీ పరిస్థితి చేయిదాటిపోయేలా ఉండటంతో లంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్‌తో పాటు ఇతర ఆటగాళ్లు, అంపైర్లు జోక్యం చేసుకుని ఇద్దరినీ విడదీయడంతో గొడవ సద్దుమణిగింది.

తొలి రోజు ఆటలో ఇంతటి నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటే మిగతా నాలుగు రోజుల్లో ఇరుజట్ల మధ్య ఆటగాళ్ల దూకుడు ఎలా ఉంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా భారత్.. శ్రీలంక ట్రాప్‌లో పడకుండా మ్యాచ్‌పై ఫోకస్ పెడితే బాగుంటుందని క్రికెట్ విశ్లేషకుల మాట. స్లెడ్జింగ్ అంటే హెల్దీగా ఉండాలి అంటారు. ఫస్ట్ టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ చేసింది అదే. డిక్వెల్లాను సరదాగా ఆటపట్టించాడు.. ఔటయ్యేలా చేశాడు. అప్పుడు ఈ మొత్తం ప్రక్రియను ఎంజాయ్ చేసిన యశస్వి ఇప్పుడు ఆవేశపడ్డాడు. ఇప్పుడు ఫెర్నాండో ఏమన్నాడు అనే ఆడియో గానీ, వీడియో గానీ బయటకు రాలేదు. ఆ విషయం తెలిస్తే ఇందులో క్లారిటీ వస్తుంది.అంతేగాకుండా నెగెటివ్ బౌలింగ్ విషయంలోనూ లంక బౌలర్లు విమర్శలు ఎదుర్కొన్నారు. శుభ్‌మన్ గిల్ హాఫ్ సెంచరీకి రెండు పరుగుల దూరంలో ఉండగా స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య ఒక ఓవర్‌లో లెగ్ సైడ్ వైపు నెగెటివ్ లైన్‌లో బౌలింగ్ చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతడు వరుసగా మూడు బంతులను లెగ్ స్టంప్‌నకు బాగా అవతలిగా విసిరాడు. దీంతో అంపైర్ ఆ మూడింటినీ వరుసగా వైడ్లుగా ప్రకటించారు. ఇలా తమ చేష్టంతో కవ్వింపులకు పాల్పడిన లంక ఆటగాళ్లు.. దేవదత్ పడిక్కల్ (117) ఔటై వెళ్లిపోతున్నప్పుడు మాత్రం ప్రశంసించడం గమనార్హం. బహుశా కవ్వింపులను కప్పిపుచ్చడం కోసమే అలా చేసినట్లు అర్థమవుతోంది. చూడాలి మరి మిగిలిన నాలుగు రోజుల ఆట ఎంత నాటకీయంగా ఉంటుందో!

## ఐపీఎల్ ఆడకుండానే భారత జట్టులోకి సారాంశ్.. ఎన్నో ప్లేయరంటే?

ఒకప్పుడు.. జాతీయ జట్టులోకి ఆటగాళ్లను ఎంపిక చేయాలంటే దేశవాళీలో అదరగొట్టాలి. కానీ, ఐపీఎల్ వచ్చాక అందులో రాణించిన వారికే అవకాశాలు పుష్కలంగా వస్తాయనేది ప్రతి ఒక్కరి అభిప్రాయం. అయితే, మళ్లీ పాత రోజులను గుర్తు చేసేలా టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఓ 33 ఏళ్ల ఆటగాడికి అవకాశం తీసుకొచ్చింది. అతడే సారాంశ్ జైన్ . శ్రీలంకతో రెండో టెస్టు బరిలోకి దిగిన తుది జట్టులో అతడికి ఛాన్స్ దక్కింది.

అతడి కంటే ముందు ఇద్దరే..

ఐపీఎల్ వచ్చాక.. ఈ మెగా లీగ్‌లో ఆడకుండా భారత జాతీయ జట్టుకు ఎంపికైన ప్లేయర్లను వేళ్ల మీదనే లెక్కించొచ్చు. ఇప్పుడు సారాంశ్ జైన్ కేవలం మూడో ప్లేయరే కావడం గమనార్హం. అతడి కంటే ముందు మురళీ విజయ్ (2008) ఆస్ట్రేలియాతో టెస్టు అరంగేట్రం చేశాడు. వెటరన్ పేసర్ షమీ (2013) పాక్‌పై వన్డేల్లో అడుగుపెట్టా డు. వీరంతా దేశవాళీలో అదరగొట్టడంతోనే అవకాశాలను అం దుకొ న్నారు. సారాంశ్ కూడా స్పిన్ ఆల్‌రౌండర్‌గా డొమిస్టిక్ క్రికెట్‌లో భారీగా పరుగులు చేసి, వికెట్లు తీయడంతో పిలుపు వచ్చింది. 54 ఫస్ట్‌క్లాస్ మ్యాచుల్లో 2,223 పరుగులు, 188 వికెట్లు పడగొట్టాడు.

అతిపెద్ద వయస్కుడిగా..

ఇటీవలే భారత్ తరపున అరంగేట్రం చేసిన అతి పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. వైభవ్ టీ20లతో అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చాడు. ఇప్పుడు టీమ్ఇం డియా తరపున 2000 తర్వాత టెస్టుల్లోకి అరంగేట్రం చేసిన అతిపె ద్ద వయస్కుడిగా సారాంశ్ జైన్ఘనత సాధించాడు. ప్రస్తుతం సారాంశ్ వయసు 33 ఏళ్ల 145 రోజులు. చివరిగా 1998లో రాబిన్ సింగ్ (35 ఏళ్ల 23 రోజులు) ఎక్కువ వయసులో డెబ్యూ చేసిన ప్లేయర్‌గా నిలిచాడు.



## రిటైర్మెంట్ ప్రకటించిన కర్ణ్ శర్మ



భారత సీనియర్ లెగ్ స్పిన్నర్ కర్ణ్ శర్మ అంతర్జాతీయ, భారత దేశవాళీ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 38 ఏళ్ల కర్ణ్ శర్మ భారత్ తరపున ఒక టెస్టు మ్యాచ్, రెండు వన్డేలు, ఒక టీ20 ఆడాడు. ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లో కాన్పూర్ సూపర్‌స్టార్స్‌కు ఆడుతున్న ఇతను.. ఆగస్టు 25న మీరట్ మావెరిక్స్‌తో ఆడే మ్యాచ్ తనకు చివరిదని పేర్కొన్నాడు. రిటైర్మెంట్ తర్వాత కోచింగ్, క్రికెట్‌కు సంబంధించిన ఇతర బాధ్యతలు చేపట్టడానికి అందుబాటులో ఉంటానన్నాడు. ఇన్నాళ్లు తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపాడు.

కర్ణ్ శర్మకు అంతర్జాతీయ కెరీర్‌లో పెద్దగా అవకాశాలు రాకపోయినప్పటికీ ఐపీఎల్‌లో మంచి బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ టోర్నీలో 90 మ్యాచ్‌లు ఆడి 83 వికెట్లు పడగొట్టాడు. అంతేకాదు మూడు వేర్వేరు జట్లతో వరుసగా మూడు ఐపీఎల్ టైటిళ్లను గెల్చుకున్న తొలి ఆటగాడిగా నిలిచాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (2016), ముంబయి ఇండియన్స్ (2017), చెన్నై సూపర్ కింగ్స్ (2018) తరపున ఐపీఎల్ టైటిళ్లను ముద్దాడాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945